



# చైతన్యరథం



సమాజమే దేవాలయం. ప్రజలే దేవుళ్ళు




రాష్ట్రంలో నీటి భద్రత సాధిస్తే ఇతర రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుంది. రాష్ట్రాన్ని కరవురహితంగా చేయటమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది. నీటి సంరక్షణ.. జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా 100 రోజుల కార్యాచరణ నిర్దేశించుకున్నాం. సాగునీటి సంఘాలు కేంద్రీకృతంగా యాక్షన్ ప్లాన్ అమలయ్యేలా ప్రణాళిక సిద్ధం చేశాం. రాష్ట్రంలోని 60 వేలమంది సాగునీటి సంఘాల సభ్యులకు కార్యక్రమ నిర్వహణ చేపట్టటే కీలక బాధ్యతలు అప్పగిస్తున్నా. నీటి భద్రత అంశంలో ప్రజలను భాగస్వాములను చేయాలి. దీన్నో ప్రజా ఉద్యమంగా మలచాలి. ఇరిగేషన్, వ్యవసాయం, పంచాయితీరాజ్, అటవీ, పశు సంవర్ధక శాఖలు సంయుక్తంగా జల సంరక్షణ కార్యక్రమాల్ని ముందుకు తీసుకుకెళ్లాలని పిలుపునిస్తున్నా.

–సీఎం చంద్రబాబు నాయుడు

# ఇక మిషన్ సేవ్ వాటర్

- రాష్ట్రంలో ప్రజా ఉద్యమంగా నీటి భద్రత
- నీటి సంరక్షణకు వంద రోజుల యాక్షన్ ప్లాన్
- వాటర్ బడ్జెట్- వాటర్ ఆడిట్ కీలకాంశాలు
- కాల్వలు, చెర్వులు, చెక్ డ్యాంలు బాగు చేసుకోవాలి
- భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి
- నీటి భద్రత.. సాగునీటి సంఘాల ప్రధాన బాధ్యత
- సాగునీటి సంఘాలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్సు

2

## నేడు సీఎం అనంత పర్యటన

తాడిపత్రిలో నీటి భద్రతపై సాగునీటి సంఘాలు, రైతులతో సమావేశం

## శాంతిమార్గాన్ని అనుసరిద్దాం

- క్రైస్తవులకు సీఎం ఈస్టర్ శుభాకాంక్షలు

అమరావతి (చైతన్య రథం): పాపుల కోసం శిలువనెక్కిన ఏసు ప్రభువు పునరుత్థానం చెందిన పవిత్రమైన ఈస్టర్ పండుగ సందర్భంగా క్రైస్తవ సోదరులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఎక్స్‌లో పోస్టు పెడుతూ.."ఈస్టర్ పండుగ ప్రేమ, విశ్వాసం, నమ్మకంలాంటి పవిత్ర భావనలను పాదుగొలిపే పవిత్ర దినం. పాప ప్రక్షాళన కోసం క్రీస్తు చేసిన త్యాగం మనకు ఆదర్శం కావాలి. ఆయన చూపిన శాంతి మార్గంలో నడుస్తూ మీరు మీ కుటుంబ సభ్యులు కలకాలం ఆనందంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నా" అని చంద్రబాబు పేర్కొన్నారు.




## ప్రపంచానికి ప్రేమ, కరుణ పంచుదాం

- క్రైస్తవులకు మంత్రి లోకేష్ ఈస్టర్ శుభాకాంక్షలు

అమరావతి (చైతన్య రథం): ప్రభువైన ఏసు పునరుత్థానం సందర్భంగా జరిపే ఈస్టర్ క్రైస్తవ లోకానికి పర్వదినమని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. 'ఎక్స్' వేదికగా పోస్టు పెడుతూ.. "సత్యం, ధర్మంలదే అంతిమ విజయమని ఈస్టర్ సందేశమిస్తోంది. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో పయనిస్తూ సాటి మనుషులకు ప్రేమ, కరుణ పంచుదాం. మూగజీవులపట్ల దయ చూపుదాం. ఏసుక్రీస్తు కృపతో ప్రపంచంలో శాంతి నెలకొనాలని ప్రజా శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నాను. క్రైస్తవులందరికీ ఈస్టర్ శుభాకాంక్షలు" అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## ● కలకాలం ఆనందంగా...



విజయవాడ సన్ రైజ్ హాస్పిటల్స్ ఎండీ, ఛైర్మన్ డాక్టర్ మాదాల నరేంద్ర కుమార్ తనయుడి వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరైన విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జరిగిన వివాహ రిసెప్షన్ కార్యక్రమంలో పాల్గొని నవ దంపతులు సాయిశిశిర్, వైష్ణవిలను ఆశీర్వదించి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలు తెలిపారు.

## ● మహనీయునికి నివాళి



బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

## సంస్కరణవాది జగ్జీవన్‌రామ్

- జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నివాళి

2

## జువ్వలదిన్నెపై వైసీపీ కుట్ర దుర్మార్గం

- మంత్రి కొల్లు రవీంద్ర ఫైర్



3



## సొంత పార్టీయే ఛీ కొడుతుంది!

- జగన్‌పై మంత్రి కొలుసు



# మిషన్ 'సేవ్ వాటర్'

- రాష్ట్రంలో ప్రజా ఉద్యమంగా నీటి భద్రత
- నీటి సంరక్షణకు వంద రోజుల యాక్షన్ ప్లాన్
- వాటర్ బడ్జెట్ - వాటర్ ఆడిట్ కీలకాంశాలు
- కాల్వలు, చెర్వులు, చెక్ డ్యాంలు బాగు చేసుకోవాలి
- మరింత నీటి నిల్వకు రాష్ట్రాన్ని సన్నద్ధం చేయాలి
- భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక ఫోకస్ పెట్టాలి
- నీటి భద్రత.. సాగునీటి సంఘాల ప్రధాన బాధ్యత
- సాగునీటి సంఘాలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్సు




అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో నీటి భద్రత సాధిస్తే ఇతర రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని కరవురహితంగా చేయటమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని.. వేసవికంటే ముందు 6 మీటర్లు, వర్షపు సీజన్ పూర్తయ్యేనాటికి 3 మీటర్ల లోతులో భూగర్భజలాలు అందుబాటులో ఉండాలని నిర్దేశించారు. ఈనెల 6నుంచి రాష్ట్రవ్యాప్తంగా చేపట్టే నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంపై సాగునీటి సంఘాలు, మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆదివారం సీఎం టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. ఇరిగేషన్, వ్యవసాయం, పంచాయితీ రాజ్, అటవీ, పశు సంవర్ధక శాఖలు సంయుక్తంగా జల సంరక్షణ కార్యక్రమాల్ని ముందుకు తీసుకుకెళ్లాలని పిలుపునిచ్చారు. నీటి సంరక్షణ- జలవనరుల పరిరక్షణ అంశాలే అజెండాగా 100 రోజుల కార్యాచరణను ముఖ్యమంత్రి ప్రకటించారు. సాగునీటి సంఘాలు కేంద్రీకృతంగా యాక్షన్ ప్లాన్ అమలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రం లోని 60 వేలమంది సాగునీటి సంఘాల సభ్యులకు కార్యక్రమ నిర్వహణ చేపట్టే కీలక బాధ్యతలను ముఖ్యమంత్రి అప్పగించారు. నీటి భద్రత అంశంలో ప్రజలను భాగస్వాములను చేయాలని... దీన్నో ప్రజా ఉద్యమంగా మలచాలని దిశానిర్దేశం చేశారు. ఈమేరకు ఏప్రిల్ 6 నుంచి జులై 14 వరకు నాలుగు దశల కార్యాచరణను ముఖ్యమంత్రి ప్రకటించారు. ఏప్రిల్ 6నుంచి ఏప్రిల్ 15వరకు పనుల గుర్తింపు కార్యక్రమం చేపట్టాలని... ఏప్రిల్ 16నుంచి 20వరకు గుర్తించిన పనులకు పరిపాలనా అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు. ఏప్రిల్ 21నుంచి జూలై 9వరకు పనుల కార్యాచరణ చేపట్టాలని... జూలై 10నుంచి జూలై 14 మధ్య పూర్తిచేసిన పనులకు సంబంధించిన నివేదికలు సమర్పించాలని సీఎం సూచించారు. నీటి పొదుపును కీలకాంశంగా తీసుకుని.. ప్రతీ నీటి బొట్టనూ ఒడిసిపట్టేలా చూడాలన్నారు. రాష్ట్రస్థాయినుంచి క్షేత్రస్థాయి వరకూ నీటి భద్రతపై ప్రత్యేక దృష్టి సారించి కార్యాచరణ చేపట్టాలని సూచించారు. నీటి భద్రత అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమమే కాదని.. సామూహిక బాధ్యతగా సీఎం చంద్రబాబు అభివర్ణించారు. ప్రతి నీటి చుక్కను సంరక్షించడం, ప్రతి ఎకరాకు నీరందించడం, ప్రతీ రైతుకు భరోసా ఇవ్వటం లక్ష్యంగా కార్యక్రమం చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. వివిధ శాఖల సమన్వయంతో సాగునీటి సంఘాలు, గ్రామ పంచాయతీల భాగస్వామ్యంతో కార్యక్రమం అమలు కావాలన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో స్టీరింగ్ కమిటీ విధానపరమైన అంశాలను పర్యవేక్షించాలని... జిల్లా, క్షేత్రస్థాయిలో కలెక్టర్ సహా సర్పంచ్ అధ్యక్షతన పనులు చేపట్టాలని ఆదేశించారు. సాగునీటి సంఘాలు దీనికి డ్రైవింగ్ ఫోర్సుగా ఉండాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5697 గ్రామాల్లో భూగర్భజలాల ఎద్దడి ఉన్నట్టు గుర్తించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అన్ని చెరువులూ నింపి భూగర్భజలమట్టాన్ని కనీసం 1.5 మీటర్లమేర పెంచటం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. "నీటిని నిల్వ చేయాలి. పొదుపు చేయాలి. మైక్రో ఇరిగేషన్ అమలు చేయాలి. ప్రతి చుక్కను సమర్థంగా వినియోగించుకోవాలి" అని సీఎం చంద్రబాబు సూచించారు.

### ప్రాజెక్టు జలధార స్ఫూర్తిగా...

ఉపగ్రహ చిత్రాల ఆధారంగా శాస్త్రీయంగా చెరువుల మ్యాపింగ్ చేయటంతోపాటు హైడ్రాలజీ మ్యాప్‌ను కూడా విశ్లేషించి అనుసంధాన ప్రక్రియను చేపట్టాలన్నారు. సాగునీటి సంఘాలు వాటర్ బడ్జెట్‌ను తయారు చేయటంతో పాటు వాటర్ ఆడిట్ కూడా చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఫీడర్ ఛానెళ్లను క్లియర్ చేయాలి. పూడిక తీత పనులు చేపట్టాలని సీఎం సూచించారు. గుర్రపు డెక్కను తొలగించి.. చెరువులు, కాల్వలను క్లియర్ చేయాలి. అప్పుడే ఎక్కువ నీటిని సంరక్షించుకోవచ్చని,ముంపును అరికట్టవచ్చని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అవసరమైన మేరకు చెక్ డ్యాంలను రిపేర్లు చేయాలి. కొత్త స్ట్రక్చర్లు నిర్మాణంచేపట్టాలని సీఎం ఆదేశించారు. భూగర్భజలాలు మరీ తక్కువగా ఉన్నచోట ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సాగునీటి సంఘాలకు ముఖ్యమంత్రి సూచించారు. అన్నమయ్య జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టు జలధార స్ఫూర్తిగా వాగులు, వంకలు, ఇతర నీటి వనరుల్ని అనుసంధానించాలన్నారు. ఎక్కడికక్కడ జల సంరక్షణా చర్యలు చేపట్టి.. ప్రతీ నీటి చుక్కనూ ఒడిసి పట్టాలని సూచించారు. నీటి భద్రతపై 100రోజుల కార్యాచరణను అనంతపురం జిల్లా తాడిపత్రి నియోజకవర్గం నుంచి ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. గత పాలకులు ఈ సంరక్షణా చర్యల్ని పక్కన పడేశారని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి సంఘాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ఈ వందరోజుల యాక్షన్ ప్లాన్‌ను విజయవంతం చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. కార్యక్రమంలో రైతులను, ప్రజల్ని భాగస్వాములను చేయాలని సీఎం పిలుపునిచ్చారు.

---



## జగ్జీవన్ సేవలు చిరస్మరణీయం

**- లోకేష్**

అమరావతి (చైతన్య రథం): మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి రాష్ట్ర విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ ఘన నివాళి అర్పించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. "బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి జగ్జీవన్ రామ్ జీవితాంతం కృషిచేశారు. సామాజిక న్యాయ పోరాట యోధుడిగా, విశిష్ట పార్లమెంటేరియన్‌గా, ప్రజాస్వామ్యవాదిగా పేరు ప్రఖ్యాతలు గడించారు. అటువంటి మహనీయుడు బాబూ జగ్జీవన్ జయంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకుందాం" అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## సంస్కరణవాది జగ్జీవన్‌రామ్

### జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళి



ఉండవల్లి (చైతన్య రథం): మాజీ ఉప ప్రధాని బాబూ జగజ్జీవన్ రామ్ 118వ జయంతి పురస్కరించుకుని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సీఎం చంద్రబాబు నాయుడు నివాళి అర్పించారు. అనంతరం మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, నేతలు కంచర్ల శ్రీకాంత్, ఉండవల్లి శ్రీదేవి, పిల్లిమాణిక్యాలరావు, బాలకోటయ్య తదితరులు జగ్గజీవన్ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు.

ఈ సందర్భంగా జగజ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. "దేశంలో వ్యవసాయాన్ని ఆధునీకరించటంతోపాటు ఆహార సంక్షోభ సమయంలో దేశాన్ని గట్టెక్కించిన మహానుభావుడు. పారిశ్రామిక వివాదాల చట్టం, కనీస వేతనాలు, ప్రావిడెంట్ ఫండ్‌లాంటి ఎన్నో సంస్కరణలు అమలు చేసిన మహనీయుడు. బాబూ జగజ్జీవన్ రామ్ స్ఫూర్తితోనే ప్రభుత్వం నడుస్తోంది.

ఎస్సీల్లోని అన్ని కులాలకూ సమాన అవకాశాలు దక్కాలనే వర్గీకరణ చేపట్టాం' అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. దళిత వర్గాలకు న్యాయం జరగాలన్నదే టీడీపీ విధానమని, ఎస్సీల అభ్యున్నతికి పనిచేసిన పార్టీ టీడీపీ అన్నారు. "ఉమ్మడి ఏపీలో జగజ్జీవన్ రామ్ రాష్ట్రమంతటా పర్యటించారు. ఎన్టీఆర్‌తో జగజ్జీవన్ రామ్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహాన్ని దేశంలోనే తొలిసారిగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసి ఆయనకు నివాళి అర్పించాం. ఎస్సీ వర్గీకరణతో అన్ని సామాజిక వర్గాలకూ న్యాయం చేశాం. ఎస్సీల్లోని అన్ని కులాలకూ సమన్యాయం జరగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. దళితుల సాధికారిత కోసమే ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది" అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## నేడు సీఎం అనంత పర్యటన

### తాడిపత్రిలో నీటి భద్రతపై సాగునీటి సంఘాలు, రైతులతో సమావేశం

అమరావతి (చైతన్య రథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. తాడిపత్రి నియోజకవర్గం యాడికిలో నిర్వహించనున్న 'సాగునీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత' అనే కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ సాగునీటి సంఘాలు, రైతులతో ముఖ్యమంత్రి సమావేశం కానున్నారు. హంద్రీనీవా కాల్వ ద్వారా నీటి ప్రయోజనాలు అందుకుంటున్న రైతులతో ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. కాలువ విస్తరణ ద్వారా వివిధ ప్రాంతాలకు చేరుకున్న నీటి ప్రవాహాలు, సాగు ప్రాంతాలు, నీటి లభ్యత తదితర అంశాలపై ముఖ్యమంత్రి వారితో చర్చించనున్నారు. సమర్ధ నీటి నిర్వహణతో రాష్ట్రవ్యాప్తంగా సాధించిన నీటి భద్రత, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూగర్భ జలాలు తదితర అంశాలపై సీఎం మాట్లాడనున్నారు. ప్రత్యేకించి సాగునీటి సంఘాలకు వంద రోజుల ప్రణాళికను ఇచ్చేలా ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేయనున్నారు. బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం వేములపాడు సమీపంలో పెండేకల్లు రిజర్వాయర్ ప్రాంతానికి వెళ్తారు. వర్షాధార ప్రాంతంగా ప్రీమాన్సూన్ డ్రై సోయింగ్ విధానంలో హాఫ్ మూన్ వ్యవసాయ కార్యాచరణను ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలిస్తారు.

### ముఖ్యమంత్రి పర్యటన వివరాలు:

అనంతపురం తాడిపత్రి నియోజకవర్గ పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు అమరావతి నుంచి 10.30 గంటలకు బయలుదేరి 12.10 గంటలకు యాడికి మండలం వేములపాడు చేరుకుంటారు. 12.30కు యాడికి మార్కెట్ యార్డ్ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 2.40 గంటలకు వేములపాడు గ్రామానికి చేరుకుని.. అక్కడ పెండేకల్లు రిజర్వాయర్ పనులు పరిశీలిస్తారు. అనంతరం సాయంత్రం 3.40కు వేములపాడులో నియోజకరవ్గ నేతలు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. తాడిపత్రి నియోజకవర్గ పర్యటన ముగించుకుని రాత్రి 7.35 గంటలకు అమరావతి చేరుకుంటారు.

# అభివృద్ధి నిరోధక శక్తి జగన్‌రెడ్డి

- రాజధాని ప్రతిపాదన చూసి నవ్వుకుంటున్నారు
- సొంత పార్టీ వారే ఆయనను వ్యతిరేకిస్తున్నారు
- అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవ చిహ్నం
- సమాచార మంత్రి కొలుసు పార్థసారథి

అమరావతి(చైతన్యరథం): ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అనుభవించిన చీకటి రోజులను, రాజధాని విషయంలో జగన్‌రెడ్డి చేసిన చారిత్రక తప్పిదాలను ఎండగడుతూ సమాచార మంత్రి కొలుసు పార్థసారథి కౌంటర్ ఇచ్చారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ జగన్‌రెడ్డి వైఖరిని, అమరావతి ప్రాముఖ్యతను వివరించారు. "గ్రామాల్లో ఒక సం ప్రదాయం ఉంటుంది.. శుభకార్యాల సమయంలో అమంగళక రమైన పేర్లు పలకకూడదని భావిస్తారు. నేడు రాష్ట్ర ప్రజలకు 'జగన్' అనే పేరు కూడా అలాంటిదే. రాష్ట్రానికి రాజధాని అనేది ఒక గొప్ప సంబరం లాంటిది. కానీ జగన్ ఆ సంతోష సమయం లో కంటిలో నలుసులా, 'రాష్ట్రానికి పట్టిన చీడపీడలా తయార య్యారని మండిపడ్డారు. రాజకీయ పక్షాలన్నీ అమరావతికి మద్దతు తెలుపుతుంటే..వైసీపీ మాత్రం పార్లమెంటులో వాకౌట్ చేసి రాష్ట్ర ప్రయోజనాలకు గండి కొట్టిందని ధ్వజమెత్తారు.

**అబద్ధాల పునాదుల మీద 'వికేంద్రీకరణ' డ్రామా**

2019-24 మధ్య జగన్ చెప్పిన 'అభివృద్ధి వికేంద్రీకరణ' అనేది ఒక శుద్ధ అబద్ధమని స్పష్టం చేశారు. అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మద్దతు ప్రకటించి అధికారంలోకి వచ్చాక సూట్‌కేసు రాజకీయాలు చేస్తూ రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారని ఎద్దేవా చేశారు. తన తప్పులను ఒప్పుకునే అలవాటు జగన్‌కు లేదని, ప్రజల అభిప్రాయాలను గౌరవించకుండా తన ఆలోచనలనే కార్యకర్తలపై రుద్దే నియంతలా వ్యవహరించారని మండిపడ్డారు. రాజధాని పేరును 'మావిగన్'గా మార్చాలని చూడ టం ఆయన 'తుగ్లక్' పాలనకు నిదర్శనమని ధ్వజమెత్తారు.

**ప్రజల ఆశల వారధి అమరావతి.. ఆదాయ మార్గం**

రాష్ట్ర విభజన తర్వాత అన్యాయంగా రోడ్డున పడ్డ ఆంధ్రులకు అమరావతి ఒక ఆత్మగౌరవ ప్రతీక అని మంత్రి పేర్కొన్నారు. ఏ నాయకుడూ చేయలేని



సాహసాన్ని చంద్రబాబు చేశారు. కేవలం ఒక పిలుపుతో రైతులు తమ విలువైన భూములను రాజధాని కోసం ఇచ్చారని గుర్తు చేశారు. హైదరాబాద్ నేడు లక్షల కోట్ల ఆదాయాన్ని ఇస్తోంది. అమ రావతి కూడా అదే స్థాయిలో అభివృద్ధి చెందితే ఏటా వచ్చే 4-5 లక్షల కోట్ల ఆదాయంతో రాష్ట్రంలోని అన్ని మూలలను అభివృద్ధి చేయవచ్చని వివరించారు. అమరావతి అనేది ఒక 'సెల్ఫ్ ఫైనా న్సింగ్ ప్రాజెక్ట్' అని, ఇక్కడ పెట్టే పెట్టుబడి రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ అని స్పష్టం చేశారు. గత 20 నెలల కూటమి పాలనలో రాష్ట్రం పురోగతి బాట పట్టిందని మంత్రి వివరించారు. వైసీపీ తేలేకపోయిన వేల కోట్ల రూపాయల నిధుల ను కూటమి ప్రభుత్వం కేంద్రం నుంచి సాధించిందని, వాటిని ప్రజల సంక్షేమం కోసం వెచ్చిస్తున్నామని చెప్పారు.

**నాలుగు జోన్ల అభివృద్ధి**

రాష్ట్రాన్ని నాలుగు జోన్లుగా విభజించి కర్నూలుకు కారిడార్, ప్రకాశం-నెల్లూరు జిల్లాలకు పోర్టులు, రిఫైనరీలను తీసుకు వస్తు న్నాం. ఇక ఐటీ ఇండస్ట్రీకి కేరాఫ్‌గా విశాఖను తీర్చుదిద్దుతున్నాం. డేటా సెంటర్, సాఫ్ట్‌వేర్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. అమరావతిని ప్రపంచ నగరాలతో పోటీ పడేలా నిర్మిస్తున్నామని వివరించారు. పెట్టుబడిదారులు వసతులు, కనెక్టివిటీ ఉన్న చోటకే వస్తారు. జగన్ లాగా 'చెట్టు కింద కూర్చుని చర్చలు జరపండి' అంటే ఎవరూ రారని మంత్రి ఎద్దేవా చేశారు. రాజధాని చట్టంపై తన వ్యాఖ్యలను వైసీపీ నేతలు వక్రీకరిస్తున్నారని, అబద్ధాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. అప్పులు తెచ్చినా, సంపద సృష్టించి వాటిని తీర్చే సత్తా ఒక్క చంద్ర బాబుకే ఉందని పునరుద్ఘాటించారు. "జగన్ ఇకనైనా అబద్ధాలు ఆపాలి. వైసీపీ కార్యకర్తలు కూడా వాస్తవాలను గ్రహించాలి. అభివృద్ధికి అడ్డుపడే వారిని ప్రజలు ఎన్నటికీ క్షమించరని హితవుపలికారు.

## జువ్వలదిన్నెపై వైసీపీ కుట్రలు దుర్మార్గం



- ప్రజల్లో అనుమానాలు సృష్టిస్తే క్షమించేది లేదు
- మత్స్యకారుల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నాం
- ఫిషింగ్ హార్బర్‌కు ఇబ్బంది లేకుండా భూములు
- తమిళనాడు బోట్లు రాకుండా నియంత్రిస్తాం
- వేట మొదలయ్యే నాటికి పూర్తిస్థాయిలో గస్తీ
- నెల్లూరు కలెక్టరేట్‌లో మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష

నెల్లూరు(చైతన్యరథం): పాండిచ్చేరి, తమిళనాడు నుంచి వచ్చే మత్స్యకార పడవలతో ఏపీ మత్స్యకారులు అనేక దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు..వైసీపీ నేతలు దానిని రాజకీయం చేయాలనుకుంటే సహించేది లేదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చ రించారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మత్స్యకార సంఘాలతో సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తమిళనాడు ఫిషింగ్ పడవలు ఏపీ సరిహద్దుల్లోకి రావడం పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. ఇప్పటికే ముఖ్యమంత్రి సమక్షంలో అధికారులతో చర్చించాం. తమిళనాడు నుంచి 600 హార్స్ పవర్ కలిగిన బోట్లు వస్తున్నాయని గుర్తించాం. కలెక్టర్, మెరైన్ పోలీస్, మత్స్యశాఖ అధికారులతో ఇప్పటికే సమీ క్షించాం. మూడు గస్తీ పడవలతో నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. తిరుపతి పరిధిలో మరో బోటు అందుబాటులోకి తీసుకొచ్చాం. తాజాగా తమిళనాడుకు చెందిన రెండు మత్స్యకార పడవలను సీజ్ చేశాం. ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 మధ్య వేట నిషేధ కాలం ఉన్నందున వేట మొదలయ్యే నాటికి పూర్తిస్థాయిలో గస్తీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. 2007లో 18 గస్తీ పడవలతో నిరంతరం సముద్ర తీరంలో గస్తీ ఏర్పాటు చేశాం. కానీ తర్వాత ప్రభుత్వం వాటిని మూలన పడేయడంతో గస్తీ లేకుండా పోయింది. పర్య వేక్షణ గాలికి వదిలేశారు. ఆ పడవలను పూర్తిస్థాయిలో వినియో గంలోకి తీసుకొచ్చేందుకు కోటిన్నరకు పైగా ఖర్చు అవుతుందని అధికారులు తెలిపారు. తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వతంగా గస్తీ ఏర్పాటు చేసి తమిళనాడు బోట్లు ఏపీ సరిహద్దుల్లోకి రాకుం డా చూసేలా సన్నాహాలు చేస్తున్నామని వివరించారు.

**మత్స్యకారుల అభివృద్ధికి పడవలు**

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సమృద్ధి యోజన పథకం ద్వారా రూ.1.25 కోట్ల విలువైన 50 పడవలు ఏపీకి కేటాయించడం హర్షణీయం. ఆ పడవలను సొసైటీల ఆధ్వర్యంలో మత్స్యకార వర్గాల అభివృద్ధికి వినియో గిస్తామని తెలిపారు. వైసీపీ నేతలు వివాదం చేస్తున్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొ స్తామని చెప్పారు. హార్బర్ విషయంలో వైసీపీ నేతలు ప్రజల మధ్య లేనిపోని విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే తాటతీస్తామని హెచ్చరించారు. మత్స్యకారుల సంక్షేమం అభివృద్ధితో పాటు రాష్ట్రానికి పరిశ్రమలు కూడా ఎంతో అవసరం. మత్స్యకారుల వృత్తికి ఎలాంటి ఆటంకం లేకుండా సాగర్ షిప్ బిల్డింగ్ సొసైటీకి కేవలం 7 ఎకరాలు మాత్రమే కేటాయించాం. ఈ విషయంలో గ్రామస్తులు మత్స్యకారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి భవి ష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటాం. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే బోట్ల విషయంలో అవసర మైతే కేంద్ర ప్రభుత్వంతో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటాం. మత్స్యకారులకు 50 ఏళ్లకే పెన్షన్, వేట నిషేధభృతి, డీజిల్ సబ్సిడీ, వలలు బోట్లు సబ్సిడీతో అందించ డం లాంటి అనేక పథకాలు తీసుకొచ్చి మత్స్యకారులకు అండగా నిలిచిన ఘనత కూటమి ప్రభుత్వం. అలాంటి కుటుంబ ప్రభుత్వంపై వైసీపీ నేతలు కుట్రలు చేయడం హేయమని విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కావ్య కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పాల్గొన్నారు.

## రైతుల త్యాగ ఫలితం అమరావతి బిల్లు

- మీ పోరాటాలు వృథా కాలేదు
- ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ
- కష్టకాలంలో అండగా ఉన్నారు
- కృతజ్ఞతలు తెలిపిన రాజధాని రైతులు

అమరావతి(చైతన్యరథం): పార్లమెంట్‌లో ఏపీ రాజధానిగా అమరావతి బిల్లు ఆమోదం పొందిన శుభ సందర్భంగా గతంలో మాకు అండగా నిలిచి మా ఉద్యమాల్లో పాలు పంచుకున్న సందర్భాలు గుర్తు చేసు కుని నందమూరి రామకృష్ణని విజయవాడలో రాజధాని రైతులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత జగన్‌రెడ్డి ప్రభుత్వంలో రాజధాని రైతులను ఎన్నో రకా లుగా ఇబ్బందులకు గురి చేశారు. ఆ సమయంలో మాకు అండ గా ఉంటూ నేనున్నానంటూ భరోసా ఇచ్చిన విషయాన్ని గుర్తుచేస్తూ అభినందనలు తెలిపారు. బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలవడానికి వచ్చామని తెలి పారు. ఈ సందర్భంగా నందమూరి రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు జగన్ పార్టీని 11 సీట్లకు దిగజార్చినా కూడా బుద్ధి రావడం లేదు. రాజధాని అమరావతిగా ఉండాలని ఆనాడు రైతులు ఉద్యమాలు చేస్తుంటే ఆడవాళ్లు అని కూడా చూడకుండా అధికార యంత్రాం గాన్ని అడ్డుపెట్టుకుని వివస్త్రలని చేసి హింసించారు.. న్యాయం, ధర్మం ఎప్పటికైనా విజయం సాధిస్తుందని పార్లమెంట్‌లో బిల్లు ఆమోదం పొందడంతో రుజువైంది. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన రాజధాని రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులి చిన్న, చెన్నుపాటి గాంధీ, వల్లూరు కిరణ్, బెస్త రాంప్రసాద్, దివాకర్, సొంటి శివరాం ప్రసాద్, నరసయ్య, మహమ్మద్ నూరు, చక్రి, తదితరులు పాల్గొన్నారు.



చైతన్యరథం

## మూడు ముక్కలాట పోయింది..

# మావిగన్ మొదలైంది

- కొత్త ప్రతిపాదనతో జగన్‌రెడ్డి కామెడీ పీస్‌గా మారారు
- అమరావతిపై కడుపుమంటతోనే కొత్త నాటకం
- ఆయన నుంచి పాఠాలు నేర్చుకునే స్థితిలో ప్రభుత్వం లేదు
- బిల్లు, తీర్మానం వ్యత్యాసం భజన బృందానికి తెలియదా
- సీఆర్డీఏ మ్యాప్ చూస్తే బాబు విజన్ అర్థమవుతుంది
- 2015లోనే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల అభివృద్ధికి సీఆర్డీఏ ద్వారా స్పష్టమైన ప్రణాళికలు రూపొందించాం
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్




మంగళగిరి(చైతన్యరథం): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా అభివృద్ధికి 2015లో 11 సంవత్సరాల క్రితమే సీఎం చంద్రబాబు స్పష్టమైన ప్రణాళికలు రూపొందించారని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు. 2015 సెప్టెంబర్ 22వ తేదీన జీవో నెం.207 ద్వారా సీఆర్డీఏ(క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ) రూపకల్పన చేసి ఈ ప్రాంత అభివృద్ధికి చంద్రబాబు బీజం వేశారని పేర్కొన్నారు. ఏపీ సీఆర్డీఏ పరిధి మ్యాప్ చూస్తే.. జగన్‌రెడ్డికి చంద్రబాబు విజన్ ఏమిటో అర్థమవు తుందని హితవుపలికారు. ఆయన దగ్గర అభివృద్ధి పాఠాలు నేర్చుకునే పరిస్థితిలో కూటమి ప్రభుత్వం లేదని దుయ్యబట్టారు. రాష్ట్ర అభివృద్ధి అంటే జగన్‌రెడ్డికి నవ్వులాటలా ఉందని ఎద్దేవా చేశారు.

### అన్ని ప్రాంతాల అభివృద్ధికి ఆనాడే ప్రణాళికలు

2014లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయిన తరువాత అన్ని ప్రాంతాల అభివృద్ధికి అప్పుడే చంద్రబాబు స్పష్టమైన ప్రణాళికలు రూపొందించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజల ఆమోదం తోనే అమరావతి రాజధానిగా ప్రతిపాదించాం. 2015లోనే ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలోని విజయవాడ, మచిలీపట్నం తదితర ప్రధాన నగరాల అభివృద్ధికి చంద్రబాబు స్పష్టమైన ప్రణాళికలు రూపొందించారు. “2015 సెప్టెంబర్ 22న జీవో నెం.207 ద్వారా సీఆర్డీఏ యాక్ట్ రూపొందించాం. సీఆర్డీఏ పరిధి ని మచిలీపట్నం దగ్గర ఉండే మోపిదేవి, ఘంటశాల, చల్లపల్లి నుండి మొదలుకుని పామర్రు, గుడివాడ నూజివీడు, మైలవరం, కొండపల్లి అటు జగ్గయపేట వరకు..ఇటు గుంటూరు దాటి యడ్లపాడు, ఫిరంగిపురం వరకు నిర్ధారించడం జరిగింది. ఆ విధంగా దాదాపు 8,350 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో మచిలీ పట్నం వద్ద గల మోపిదేవి నుంచి ఇటు గుంటూరు దాడి యడ్లపాడు వరకు సీఆర్డీఏ పరిధి ఉంది. ఇది తెలుసుకోకుండా పిచ్చి తుగ్లక్‌లా జగన్‌రెడ్డి మావిగన్ పేరు ప్రతిపాదన తో కొత్త నాటకానికి తెరలేపారు. ఏపీ సీఆర్డీఏ మ్యాప్ చూస్తే.. గౌరవ జ.మో.రెకి చంద్రబాబు విజన్ ఏమిటో తెలుస్తుందని హితవు పలికారు. సీఆర్డీఏ అంటే అమరావతి రాజధాని నగరం మాత్రమే కాదు. దాని బయట ఉన్న విజయవాడ, గుంటూరు, తెనాలి వంటి ఆరు నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలతో కూడిన కోర్ రీజియన్ (Core Region) మరియు ఉయ్యూరు, నూజివీడు, పొన్నూరు వంటి మరొక ఆరు మున్సిపాలిటీలతో కూడిన ఎక్స్ టెండెడ్ రీజియన్..అంతేకాకుండా జగ్గయ్యపేట మున్సిపాలిటీ, రూరల్ మండలాలతో కూడిన పెరిఫెరల్ ఎక్స్‌టెండెడ్ రీజియన్ వంటి జోన్‌లతో కూడి ఉంటుంది. ఆ విధంగా సీఆర్డీఏ కేవలం అమరావతి రాజధాని అభివృద్ధి కోసమే కాకుండా దాని వెలుపల ఉన్న అనేక ప్రాంతాల అభివృద్ధికి దోహద పడుతుందని స్పష్టం చేశారు.

### సీఆర్డీఏను రద్దు చేసే ప్రయత్నం ఎందుకు చేశారు?

“మావిగన్ ప్రతిపాదనపై నేడు అంత ప్రేమ ఒలకబోస్తున్న జగన్.. దాదాపు అంతే పరిధితో ఉన్న ఏపీ సీఆర్డీఏ 2020లో ఏపీ సీఆర్డీఏ యాక్ట్‌ను ఎందుకు రద్దు చేయాలనుకున్నారు. అప్పుడు గుర్తుకు రాలేదా ఈ ప్రాంత అభివృద్ధి. అప్పుడు గుర్తుకు రాలేదా ఈ గ్రోత్ కారిడర్. దీనిపై జగన్ మరియు ఆయన భజన బృందం సమాధానం చెప్పాలి. ఆనాడు హైకోర్టు మొట్టికాయలు వేయడం తోనే కదా మూడు రాజధానుల అంశంపై జగన్ వెనక్కి తగ్గి సీఆర్డీఏ రద్దు విరమించుకున్నాడు. ఆనాడు ఔటర్ రింగ్ రోడ్డు ద్వారా హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో.. నేడు అమరావతి రాజధాని చుట్టూ సీఆర్డీఏ పరిధిలో ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులతో అమరావతి రాజధానితో పాటు సీఆర్డీఏ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుంది. కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ను సమానంగా అభివృద్ధి చెందుతున్నాయి. “ఏపీ ఛీఫ్ జాబ్ క్రియే టర్” నారా లోకేష్ కృషితో ఉత్తరాంధ్రకు ఆర్సెలాల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ డేటా సెంటర్, టీసీఎస్, కాగ్నిజెంట్, వంటి అనేక ఐటీ కంపెనీలు వచ్చి లక్షల కోట్లు పెట్టుబడులు పెడుతున్నాయి. రాయ లసీమ ప్రాంతాన్ని రెన్యూబుల్ ఎనర్జీ, ఆటో మొబైల్ తదితర రంగాల్లో అభివృద్ధి పరుస్తూ మరియు ఉద్యానవన హబ్‌గా తీర్చి దిద్దడానికి అడుగులు ముందుకుపడుతున్నాయి. కర్నూలులో అతి త్వరలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అవుతుంది. నిజమైన రాయల సీమ బిడ్డగా రాయలసీమ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేస్తు న్నారని తెలిపారు.

### బిల్లుకు, తీర్మానానికి వ్యత్యాసం తెలియదా?

“తీర్మానం అనేది కేవలం ఒక అభిప్రాయాన్ని వ్యక్త పరచడానికే మాత్రమే.. కానీ బిల్లు అనేది చట్టాలకు రూపొందించడానికి అనేది గుర్తుపెట్టుకోవాలి. అమరావతి రాజధాని విషయంగా అసెంబ్లీలో చేసింది తీర్మానం మాత్రమే..అది బిల్లు కాదని తెలిపారు. ఒక తీర్మానం పంపడానికి ఉభయ సభలను సమావేశపరచాల్సిన అవసరం లేదని.. కేవలం చట్టాలు రూపొందించడానికి బిల్లులు ప్రవేశపెట్టినప్పుడు మాత్రమే ఉభయసభలు ఏర్పాటు చేసి వాటి ఆమోదం తీసుకోవాల్సి ఉంటుందని వివరించారు. అందువల్లే మన అసెంబ్లీలో అమరావతి రాజధాని తీర్మానం చేసి పంపగా కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఏపీ రీ ఆర్గనైజేషన్ యాక్ట్ అమెండ్‌మెంట్ బిల్లు ప్రవేశపెట్టి అమరావతిని రాష్ట్ర రాజధానిగా ప్రకటిస్తూ చట్ట సవరణ చేసి లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదించడం జరిగింది. బిల్లుకు, తీర్మానానికి మధ్య వ్యత్యాసం ప్రజలు గ్రహిం చాలని సూచించారు. అసెంబ్లీలో చేసింది తీర్మానమని చెప్పారు. బిల్లుకు, తీర్మానానికి వ్యత్యాసం తెలియని జగన్.. ఆయన భజన బృందం ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. బిల్లు చట్ట రూపం దాల్చే సమయంలో రాష్ట్రాలలో కానీ, కేంద్రంలో కానీ ఉభయసభల్లో ప్రవేశపెట్టాలని, ఉభయ సభలు ఆమోదిస్తేనే అది చట్టం అవుతుందని వివరించారు. మనం ఇక్కడ శాసనసభలో చేసింది తీర్మానం మాత్రమే.. అది కూడా కేంద్రం సలహాపై ఆ తీర్మానం చేసినట్లు తెలిపారు. అమరావతి చట్టబద్ధం గా రాజధాని కావడానికి కావలసిన ఆంధ్రప్రదేశ్ రీ ఆర్గనైజేషన్ (అమెండ్‌మెంట్) బిల్లు ఉభయ సభలు లోక్‌సభ, రాజ్యసభలో ప్రవేశపెట్టారని తెలిపారు. ఉభయసభ ల్లోనూ ఆ బిల్లు ఆమోదం పొందినట్లు చెప్పారు. బిల్లుకు, తీర్మానానికి మధ్య వ్యత్యాసం ప్రజలు తెలుసుకోవాలని కోరారు. మన రాష్ట్ర అసెంబ్లీలో చేసింది తీర్మానం మాత్రమే అని చెప్పారు.

### మావిగన్ ప్రతిపాదనతో కామెడీ పీస్‌గా మారారు

“మావిగన్ పేరు ప్రతిపాదనతో జగన్ కామెడీ పీస్‌గా మారిపోయారు. రాష్ట్ర అభివృద్ధి అంటే జగన్‌కు నవ్వులాటలాగా ఉంది. దేశంలోని అన్ని పార్టీలు అమరావతి చట్టబద్ధతకు అను కూలంగా ఉంటే జగన్ ఒక్కరేవ్యతిరేకంగా నిలిచారు.ఉభయ సభల్లో వైసీపీ వాకౌట్ చేయడంతో అమరావతిపై ఆ పార్టీ వైఖరి ఏంటో స్పష్టంగా అర్థమైంది. అమరావతిలో అభివృద్ధి పనులు పరుగులు పెడు తున్నాయి. రాజధానిలో అభివృద్ధి వేగం పుంజు కుని అభివృద్ధి చెందుతున్న కొద్దీ.. తాడేపల్లి ప్యాలెస్‌లో గోడలుబద్దలు అవుతాయి.అమరావతిపై కడుపు మంటతోనే జగన్ వెటకారంగా మావిగన్ పేరు ప్రతిపాదన తెచ్చారని పట్టాభిరామ్ మండి పడ్డారు.తామువస్తే ఆ బిల్లు మరలా రద్దుచేస్తామని అంటున్న జగన్.. పార్లమెంట్ చేసిన చట్టాలను రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయలేవనే ఇంగిత జ్ఞానం లేదని ఎద్దేవాచేశారు. అమరావతి అన్‌స్టాప్‌బుల్.. ఇకపై ప్రతీనెలా అమరావతిపై సమీక్షలు జరిపి అమరావతి పనులు పరుగులు పెట్టిస్తానని సమీక్షలో సీఎం వివరించారు. అతి త్వరలోనే ప్రపంచస్థాయి రాజధాని మన అమరావతి నిలుస్తుందని చెప్పడం రాష్ట్ర ప్రజలకు మరింత ఆనంద కలిగించిందని వ్యాఖ్యానించారు.

---

## పిడుగురాళ్ల సమీపంలో

# రోడ్డు ప్రమాదం

- తక్షణమే స్పందించిన 108 సిబ్బంది
- క్షతగాత్రులకు తప్పిన ప్రాణాపాయం

అమరావతి(చైతన్యరథం): గుంటూరు జిల్లా పిడుగురాళ్ల సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వేగంగా వచ్చిన లారీ, కారు ఒకదాని కొకటి బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108 అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందిన కొద్ది నిమిషాల్లోనే 108 అంబులెన్స్ ఘటనా స్థలానికి చేరుకుంది. ప్రమాదంలో కారు లో చిక్కుకున్న బాధితులను సిబ్బంది చాకచక్యంగా బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన ఆరుగురికి 108 ఈఎమ్‌టీ సిబ్బం ది అంబులెన్స్‌లోనే ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర సమయంలో 108 సిబ్బంది సకాలంలో స్పందించి బాధితులకు అండగా నిలవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాధితులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

---

# ఏడు వాగులు దాటి.. ప్రాణాలు కాపాడి..

- 108 సిబ్బంది సాహసోపేతం
- అడ్డంకులను అధిగమించి
- యువకుడిని కాపాడిన వైనం

అమరావతి/అడ్డతీగల(చైతన్యరథం): అటవీ ప్రాంతం.. రహదారి లేదు.. అడ్డంగా ప్రవహి స్తున్న వాగులు.. ఎన్ని ఆటంకాలు ఎదురైనా మొక్కవోని ధైర్యంతో వాటిని అధిగమించి 108 సిబ్బంది ఒక యువకుడి ప్రాణాన్ని కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. వై.రామవరం మండలం పి.యర్రగొండ పంచాయతీలోని తడికోట గ్రామానికి చెందిన చోళ్ళ చిన్నరెడ్డి (20) అనే యువకుడు ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సమాచారం అందిన వెంటనే అడ్డతీ గల ప్రాంతానికి చెందిన 108 వాహనం సంఘటన స్థలానికి బయలుదేరింది. బాధితుడు ఉన్న ప్రాంతానికి వెళ్లేందుకు సరైన రహదారి సౌకర్యం లేదు. మార్గ మధ్యలో ఏడు వాగులు అడ్డంగా ఉన్నప్పటికీ పైలట్ నవాజ్, ఈఎంటీ వెంకట్ ఏమాత్రం వెనకడుగు వేయలేదు. కాలినడకన అటవీ మార్గంలో ప్రయాణించి గ్రామానికి చేరుకున్నారు. వాహనం లోపలికి వచ్చే అవకాశం లేకపోవడంతో బాధితుడిని ఒక డోలీలో ఉంచి సుమారు 5 కిలో మీటర్ల దూరం భుజాలపై మోసు కుంటూ ప్రధాన రహదారిపై ఉన్న 108 వాహనం వద్దకు తీసుకువచ్చారు. అక్కడి నుంచి క్షతగాత్రుడిని అత్యంత వేగంగా అడ్డతీగల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానిక తరలించి వైద్యులకు అప్పగించారు. సకాలంలో వైద్యం అందేలా చూడటంలో 108 సిబ్బంది ప్రదర్శించిన సమయస్ఫూర్తిని స్థానికులు కొనియాడారు. ప్రజల ప్రాణాలు కాపాడటమే పరమావధిగా భవ్య హెల్త్ సర్వీసెస్ (108) పనిచేస్తోంది. “ఆపదలో మేమున్నాం” అనే భరోసాతో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో సైతం అత్యుత్తమ సేవలు అందించడమే మా సంకల్పమని తెలిపారు.





# బడుగుల కోసం పోరాడిన మహానేత జగ్జీవన్‌రామ్

## ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర - తిరుపతిలో జయంతి వేడుకలు



తిరుపతి(చైతన్యరథం): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా తిరుపతి నగరంలోని కేశవాయణ గుంట, బైరాగిపట్టెడలో ఉన్న బాబూ జగ్జీవన్ రామ్ పార్క్ వద్ద విగ్రహానికి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ నాయకులు సుగుణమ్మ, మాజీ మంత్రి పరసారత్నం, సీఆర్ రాజన్‌తో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సామాజిక సమానత్వం కోసం, పేదల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానేత బాబూ జగ్జీవన్ రామ్. అటువంటి మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజంలో ప్రతి వర్గానికీ న్యాయం జరిగేలా కృషిచేయడం చేయాలని పిలుపునిచ్చారు. సుమారు 30 సంవత్సరాలు కేంద్ర మంత్రిగా, 50సంవత్సరాలు పార్లమెంట్ సభ్యునిగా ఉంటూ ప్రజల కోసం నిరంతరం శ్రమించారు. ఎమర్జెన్సీ సమయంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళంవిప్పిన మొట్టమొదటి పార్లమెంట్ సభ్యునిగా నిలిచారు.అలాంటి మహనీయుని జయంతి వేడుకల్లో పాల్గొనడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కులం మతం ప్రాంతం పేరుతో కొంతమంది ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కుట్రలు చేస్తున్నారు. ఉద్యోగుల విధి నిర్వహణ కూడా అడ్డుకునేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటు. అమరావతి విషయంలో వైసీపీ నేతల కుట్రలు దుర్మార్గం. అమరావతి రాజధానిగా వద్దు అంటూ మావిగన్ రాజధాని కావాలని ప్రకటించి జగన్‌రెడ్డి కామెడీ పీస్‌ల మారిపోయారు. కూటమి పాలనపై ప్రజలుసంతోషంగా ఉన్నారు.వైసీపీ నాయకులు అరాచకాలు చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనాలు



- ఆలయ నిర్వహణకు నిధులు ఇస్తాం
- స్థానిక ఎన్నికల్లో కురబలకు ప్రాధాన్యం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

కర్నూలు(చైతన్యరథం): త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనంతో పాటు ఆలయ నిర్వహణకు నిధులు కూడా ఇవ్వనున్న టు బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. విద్యతోనే కురబల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీపరంగా కురబలకు ప్రాధాన్యమిచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కర్నూలులో ఆదివారం జరిగిన కురబల ఆత్మీయ సమావేశంలో ఎంపీ బత్తిపాటి నాగరాజుతో కలిసి ఆమె పాల్గొని ప్రసంగించారు. ఐక్యతతోనే కురబల అభివృద్ధి సాధ్యమవు తుందన్నారు. రాజకీయాలకతీతంగా ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. భక్త కనకదాస జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించడమే కాకుండా శాశ్వత జీవో కూడా ఇచ్చామన్నారు. త్వరలో గుడికట్ల పూజారులకు గౌరవ వేతనం అందించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇదే విషయమై ఇటీ వల సీఎం చంద్రబాబుతో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కురబలుజిల్లాలు, మండలాలవారీగా తక్షణమే కుల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర స్థాయి కమిటీ నియామకానికి ఆసక్తి కలిగిన వారు తమ పేర్లు అందజేయాలని తెలిపారు. అనంతరం కురబ రాష్ట్ర సంక్షేమ సంఘ అధ్యక్షునిగా ఎస్.కే.మల్లి కార్జున, గౌరవ అధ్యక్షుడిగా తట్టే అర్జునరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రెడ్డి ప్రసాద్, ఉపాధ్యక్షులుగా కర్నూలు శ్రీనివాసరావు, మదనపల్లి లక్ష్మన్న, గుంటూరు సత్యనారాయణ రాజు, నంద్యాల శ్రీరాములు, జనరల్ సెక్రటరీగా ఏలూరి సూర్యనారాయణ, కోశాధికారిగా సంతల శ్రీరాములును అందరి సూచన మేరకు ఎంపిక చేశారు. కార్యదర్శులుగా మహేంద్ర(కర్నూలు), చెన్నప్ప (కొత్త చెరువు), దోనస్వామి (అనంతపురం), వెంకటేశ్వరరావు (మచిలీపట్నం), రఘు (రాయచోటి), కాంతారావు (పీలేరు), ప్రచార కార్యదర్శులుగా ఆదోని సంతోష్, పెనుకొండ రామాంజి నేయులు, తిరుపతి శ్రీనివాసులు,బాపట్ల పరమేశ్వరరావు, బక్క రామకృష్ణను ఎంపిక చేశారు. ఎంపికైన వారు కురబల సంక్షేమానికి కృషిచేయాలని మంత్రి సవిత పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి సవితను కురబ సామాజిక వర్గీయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కురబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, కర్నూలు జిల్లాకు చెందిన కురబ సామాజిక వర్గీయులు,వివిధ పార్టీలకు చెందని కురబ నేతలు పాల్గొన్నారు.

## నేరడి బ్యారేజీ నిర్మించి

# ప్రతి ఎకరాకు నీరిస్తాం



- వైసీపీ నిర్లక్ష్యం వల్లే సమస్య పరిష్కారం కాలేదు
- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం(చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లాకు అత్యంత ప్రాధాన్యమైన వంశధార నేరడి బ్యారేజీని కూటమి ప్రభుత్వం హయాంలో నిర్మాణం పూర్తి చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. బాబు జగజ్జీవన్‌రామ్ 119వ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి కారణంగా బ్యారేజీ సమస్యను పరిష్కరించలేక పోయారని విమర్శించారు. వైకాపా హయాంలో నిపుణులైన న్యాయవాదులను నియమించకపోవడంతో సమస్య పరిష్కారం జరగలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సంబంధిత విషయాన్ని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ దగ్గరకు తీసుకెళ్లి పరిష్కరించడంలో తమదైన చొరవ చూపి పరిష్కరించడం ఆనందంగా ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చేలా కృషి చేశారని, ట్రైబ్యునల్ తీర్పుసంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. న్యాయపరమైన అడ్డంకులు కొంతవరకు తొలగిపోయాయని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు, తాగునీరు అందిం చడమే తమ ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి ఎప్పటి నుంచో నేరడి బ్యారేజీ నిర్మాణం ఒక ప్రతిపాదనగానే ఉందని, పొరుగు రాష్ట్రంతో ఉన్న చిన్న అడ్డంకి త్వరలోనే తొలగనుందని తెలిపారు. ఇప్పటికే నేరడి బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు పలు సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వం లక్ష్యమని స్పష్టం చేశారు.

# ఆర్టీసీ బస్సు ప్రమాదంపై విచారణ





- తక్షణమే నివేదిక ఇవ్వాలి
- మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశం

అమరావతి(చైతన్యరథం): కడప జిల్లాలో విద్యుత్ వైర్లు తగిలి ఆర్టీసీ బస్సుకు మంటలు వ్యాపించటంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ విచారణకు ఆదేశించారు. సీఎండీని వివరణ కోరారు. టంకీ పద్ధతుల్లో పనులు జరుగుతున్న సందర్భంలో ప్రమాదం జరిగిందని అధికారులు వివరణ ఇచ్చారు. టంకీ పనులపైనా శాఖపరంగా పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని మంత్రి సూచిం చారు. రోడ్డు మార్గాల్లో పనులు జరుగుతున్నప్పుడు ప్రమాద సూచికలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ముందు జాగ్రత్త చర్యలతో ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

### స్పందించిన రవాణా శాఖ మంత్రి మండిపల్లి

కడపజిల్లాలో ఆర్టీసీ బస్సు దగ్ధమైన ఘటనపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్పందించారు. డ్రైవర్ అప్రమత్తతతో ప్రాణనష్టం తప్పింది. ప్రమాద సమయంలో బస్సులో 21 మంది ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహ రించిన తీరుపై అభినందించారు. డ్రైవర్ సమయోచిత నిర్ణయంతో పెద్ద ప్రమాదం తప్పిందని తెలిపారు.

# మేడపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

## పాల్గొన్న మంత్రి నిమ్మల రామానాయుడు



పాలకొల్లు(చైతన్యరథం): పాలకొల్లు నియోజకవర్గం మేడ పాడు గ్రామంలో రూ.2.70 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి మంత్రి నిమ్మల రామానాయుడు శంకుస్థాపన చేశారు. మరో కోటి రూపాయలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. జగన్ హయాంలో అన్ని రంగాలను విధ్వం సం చేసినట్లే విద్యుత్ రంగాన్ని కూడా ధ్వంసం చేశాడు. నాడు ఐదేళ్లలో జగన్ విద్యుత్ ఛార్జీలను 11 సార్లు పెంచి ప్రజలపై భారం మోపాడు. తిక్క తిక్క స్లాబులు ప్రవేశపెట్టి సామాన్యులను సైతం ఇబ్బంది పెట్టాడు. నేడు చంద్రబాబు ట్రూ ఆఫ్ కాదు. ట్రూ డౌన్ అంటూ యూనిట్‌కి 13 పైసలు చొప్పున తగ్గించి భారం తగ్గించాం. కరెంటు చార్జీలు పెంచమని ఇచ్చిన మాటను నిల బెట్టుకున్నాం. విద్యుత్ డిస్కంలు ప్రతిపాదించిన రూ.16 వేల కోట్ల ఆదాయ లోటును ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.

# మన్యంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

## రూ.12 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి పునర్నిర్మాణం
## పాల్గొన్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

పార్వతీపురం(చైతన్యరథం): మన్యం జిల్లా పార్వతీపురం నియో జకవర్గంలో ఎస్‌హెచ్-36పై సాలూరు - రామభద్రాపురం - రాయగడ మార్గంలో సీతానగరం వద్ద సువర్ణముఖి నదిపై రూ.12 కోట్లతో పునర్నిర్మించిన హై లెవల్ బ్రిడ్జ్‌ను ఆర్ అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. అనంతరం మక్కువ - అజ్జాడ మధ్య ఎన్‌డీబీ రోడ్డు, బొబ్బిలి-బలిజపేట నుంచి అరసాడ వరకు 4.5కి.మీ మేర రూ.2.40కోట్ల వ్యయంతో డానిష్ ఫైబర్ టెక్నాలజీతో నిర్మించిన అధునాతన రహదారి, రూ.1.5 కోట్లతో 4.7 కిమీ మేర నిర్మించిన పనుకు వలస-బలిజిపేట-కొత్తపల్లి రహదారులను ప్రారంభిం చారు. ఈ రహదారి నిర్మాణంతో చిలకలపల్లి, బలిజిపేట, నారాయణపురంగ్రామాలను అనుసంధానం చేస్తుంది.. తద్వారా దాదాపు 50వేల మంది ప్రజలకు ప్రయోజనం కలుగుతుంది. ఈసందర్భంగా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ మన్యం జిల్లాలో మొత్తం 1072 కి.మీ రోడ్లు అభివృద్ధి పనులు రూ.79.83కోట్ల వ్యయంతో చేపడుతున్నాం. పార్వతీపురం నియోజకవర్గంలో 240కి.మీ రోడ్లకు సుమారు రూ.19.66 కోట్లు కేటాయించామని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఒక్క ఏడాదిలో ఆర్ అండ్‌బీ శాఖకు రూ.3000 కోట్లు కేటాయింపులు చేశామని వివరించారు.





### అమరావతిపై వైసీపీ దుష్ప్రచారం

గత వారం రోజులుగా అమరావతిపై వైసీపీ దుష్ప్రచారం చేస్తుంది. గతంలో అమరావతికి దేశ ప్రధాని శంకుస్థాపన చేస్తే ఈ దుర్మార్గుల పాలనలో అమరావతిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. అమరావతి పేరుతో మూడుముక్కలాటాడారు. అందుకే 11 సీట్లకు దించారు. 34 వేల ఎకరాల భూములు ఇచ్చిన రైతుల త్యాగం వృధా కాలేదు. దేశ చరిత్రలో ఎప్పుడు లేని విధంగా నేడు అన్ని పార్టీలు ఏకతాటి పైకి వచ్చి అమరావతికి మద్దతుగా నిలిచాయి. ఇటువంటి సమయంలో వైసీపీ మాత్రం అమరావతికి వ్యతిరేకంగా వాకౌట్ చేయడం దురదృష్టకరమని మండిపడ్డారు.

### బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని పార్వతీపురంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర,కూటమినేతలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

### వంతెన నిర్మాణ పనుల పరిశీలన

విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గంలో బొబ్బిలి - రామభద్రపురం మార్గంలో వేగావతి నదిపై నిర్మిస్తున్న పారాధి వంతెన నిర్మాణ పనులను మంత్రి స్వయంగా పర్యవేక్షించారు. నియోజకవర్గానికి వచ్చిన మంత్రికి బొబ్బిలి వీణను స్థానిక ఎమ్మెల్యే రంగారావు (బేబీ నాయన) బహూకరించారు. బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు.

# రాష్ట్రానికి పిడుగులతో వర్ష సూచనలు

- ఉపరితల ఆవర్తనం ప్రభావం
- విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరిక

అమరావతి(చైతన్యరథం): రానున్న రెండురోజులు రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొననున్నట్లు విపత్తుల నిర్వహ ణ సంస్థ ఎండీ ప్రఖర్‌జైన్ తెలిపారు. సోమ, మంగళవారాల్లో మేఘావృతమైన వాతావరణంతో పాటు పిడుగులతో కూడిన వర్షా లు, మరోవైపు కొన్ని జిల్లాల్లో ఎండలు ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. దక్షిణ కోస్తాంధ్ర-పశ్చిమ మధ్య బంగాళాఖాతంపై ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని తెలిపారు. రాయలసీమ, పరిసర ప్రాంతాలపై మరో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని పేర్కొన్నారు. వీటి ప్రభావంతో సోమవారం ఎల్లుండి మేఘా వృతమైన వాతావరణంతో పాటు పిడుగులతో కూడిన వర్షా లు కురిసే అవకాశం ఉందన్నారు. ఉరుములతో కూడిన వర్షం పడేటప్పుడు పొలాల్లో పనిచేసే రైతులు, పశు కాపరులు చెట్ల కింద నిలబడరాదని హెచ్చరించారు. సోమ, మంగళవారాల్లో వాతా వరణం కింద విధంగా ఉండనున్నట్లు వివరించారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదా వరి జిల్లాల్లోని కొన్నిప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు బాపట్ల, పల్నాడు, మార్కా పురం, ప్రకాశం, నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం పోలవరం జిల్లా చింతూరు, ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో వడగాలులు ప్రభావం చూపనున్నట్లు తెలిపారు.

### రాష్ట్రంలో ఉష్ణోగ్రతల వివరాలు

ఆదివారం మన్యం(జి) వీరఘట్టం, నెల్లూరు(జి) నెల్లూరుపాలెం లో 42.4 డిగ్రీలు, తిరుపతి(జి) రేణిగుంటలో 42.3,మార్కాపు రం(జి) నందన మారెళ్ల లో 41.8, కడప(జి) ఒంటిమిట్టలో 41.5, కృష్ణా(జి) పెద్దపారుపూడిలో 41.3, చిత్తూరు(జి) పలమనేరు, ప్రకాశం(జి) చెరువుకొమ్ము పాలెంలో 40.9, కర్నూలు(జి) తోవి, శ్రీకాకుళం(జి) జి.సిగడాంలో 40.7, అనంతపురం(జి) భట్టువాని పల్లిలో 40.5, పల్నాడు(జి) గురజాలలో 40.4, విజయనగరం(జి) సంతకవిటిలో 40.3,నంద్యాలలో 40.1 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు, 66 మండలాల్లో 40డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు. ఎండ తీవ్రత, ఉక్కపోత పట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



# తుగ్లక్ పేరు చదివాం.. ఇప్పుడు చూస్తున్నాం




- మావిగన్ పేరు విని ప్రజలు నవ్వుకుంటున్నారు
- అమరావతి ఆర్థిక శక్తితో అభివృద్ధికి బాటలు
- స్త్రీ శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

అరకు(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం లో అమరావతి పునర్నిర్మాణం విజయపథంలో సాగుతోందని స్త్రీ శిశు సంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు. అమరా వతికి చట్టబద్ధత కల్పించడంపై ఆదివారం విజయోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను ప్రజలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గత వారంరోజులుగా 5 కోట్ల మంది ప్రజలు సంబరాలు చేసు కుంటున్నారు. అమరావతి చట్టబద్ధత విషయంలో దేశంలోని 50కి పైగా రాజకీయ పార్టీలు మద్దతు తెలిపితే కేవలం వైసీపీ మాత్రమే వ్యతిరేకించి సభ నుంచి వాకౌట్ చేసింది. రాష్ట్ర విధ్వంసమే వారి లక్ష్యం. మూడు రాజధానుల పేరుతో రాయలసీమ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టాలని కుట్రలు చేశారు.. ఇప్పుడు మావిగన్ అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. ప్రజలు జగన్‌రెడ్డి వైఖరి చూసి నవ్విపోతున్నారని వ్యాఖ్యానించారు. అమరావతిని నమ్మి 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు.. రైతుల కష్టాలు తీరాయి.. ప్రజల ఆకాం క్ష అమరావతి అని స్పష్టం చేశారు.




# ఇంటింటా వాకిళ్లలో ముగ్గులై మెరిగిన జై అమరావతి

## సంబరాల్లో ముఖ్య అతిథిగా విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు

విజయనగరం (చైతన్యరథం): ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష, తెలుగు ప్రజల కలల రాజధాని అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించిన నేపథ్యం నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలతో కలిసి " జై అమరావతి" స్లొగన్స్ తో, బాణాసంచాతో సంబరాలు చేసుకున్నారు. టీడీపీ సీనియర్ నాయకులు పిషిణి జగన్నాథం నాయుడు, యువ నాయకులు హరి నాయుడు ఆధ్వర్యంలో ఎచ్చెర్ల నియోజకవర్గం, రణస్థలం మండలం, కోష్ట పంచాయతీలో జరిగిన సంబరాల్లో విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముఖ్యంగా కోష్ట గ్రామాల్లో రాజధాని అమరావతిని స్వాగతిస్తూ జై అమరావతి అని జేజేలు పలుకుతూ మహిళలు, ప్రతి ఇంటి ఆడపడుచులు వారి వారి నివాసాలు ముందు "జై అమరావతి అని ఇంటి ముందు ప్రాంగణాలను ముగ్గులతో అలంకరించడం అభినందనీయమని ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆనందాన్ని, సంతోషాన్ని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో టిడిపీ సీనియర్ నాయకులు పైడి అప్పడ దొర, పిసిని అసిరి నాయుడు, పిన్నింటి బానోజీ నాయుడు, బాతువ కూర్మారావు,ణతీ. కిషోర్, చిన్నారావు, సత్యం అప్పడు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, ప్రజలు పాలొన్నారు.

విజయనగరం (చైతన్యరథం): ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్ష, తెలుగు ప్రజల కలల రాజధాని అమరావతి చట్టబద్ధతపై హర్షాన్ని వ్యక్తం చేస్తూ విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబ సభ్యులతో కలిసి రాజధాని అమరావతిని స్వాగతిస్తూ "మన రాజధాని, మన అమరావతి"కి జై అమరావతి అని ముగ్గులు వేయించారు.







# విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యం

## శ్రీకాకుళం శాసన సభ్యుడు గొండు శంకర్



శ్రీకాకుళం (చైతన్యరథం): పట్టణంలోని చెట్టువానిపేట గ్రామం సమీపంలో సంస్కార్ విద్యాసంస్థల వార్షికోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ హాజరై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, వారు మంచి విద్యతో పాటు ఉన్నత విలువలను అలవరచుకుంటే సమాజం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో విద్యతో పాటు టెక్నాలజీపై పట్టు సాధించడం ఎంతో అవసరమని, యువత మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అలాగే, ప్రభుత్వం విద్యా రంగానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మధ్య విద్యా అంతరాన్ని తగ్గించడం, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన చెప్పారు. సంస్కార్ విద్యాసంస్థలు విద్యతో పాటు సంస్కారాలను కూడా అందించడం అభినందనీయమని, ఇలాంటి విద్యాసంస్థలు సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకుని కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట రాముడికి పుష్పయాగం

ఒంటిమిట్ట చైతన్యరథం) ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం పుష్పయాగ మహోత్సవం భక్తి భరితంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, ఆలయ శుద్ధి, నిత్య ఆరాధనలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం వైభవంగా ప్రారంభమైంది. తులసీదళాలు, మల్లెలు, రోజాలు, చామంతులు, గన్నేరు, సంపంగి, మొగలిదళం వంటి పుష్పాలు, పత్రాలతో స్వామి, అమ్మవారికి పుష్పనీరాజనం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 3 టన్నుల పుష్పాలు విరాళంగా అందాయి.

# ఘనంగా డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి



విశాఖపట్టణం (చైతన్యరథం): మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో జరిగినది. ఈ కార్యక్రమంలో జగ్జీవన్ రామ్ గారి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు చోడే వెంకట పట్టాబి రామ్, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చోడే వెంకట పట్టాబి రామ్ మాట్లాడుతూ వెనుకబడిన, అణగారిన వర్గాల జీవితాన్ని అంకితం చేసిన మహానాయకుడు, తొలి దళిత భారత ప్రధాని "బాబూజీ" గా కీర్తించబడిన శ్రీ లిబాబు జగ్జీవన్ అని అన్నారు తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి దళితులకు న్యాయం చేసిందని గొప్ప గొప్ప పదవులు తెలుగుదేశం పార్టీ ఇచ్చిందని అన్నారు. అసెంబ్లీ స్పీకర్గా ప్రతిభ భారతి పార్లమెంట్ స్పీకర్గా బాలయోగి కొన్ని పార్టీలు చెప్పుకుంటాయి గాని తెలుగుదేశం పార్టీ చేసి చూపిస్తాదని టిడిపి ఆశయాలు ఎప్పుడు బడుగు బలహీన వర్గాలకు అంకితం అవుతాయని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బుడుమూరి గోవింద్ , ప్రధాన కార్యదర్శి పి జయరాజ్ జాన్,రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పొడుగు కుమార్, కార్పొరేషన్ డైరెక్టర్ ఇతలపాక సుజాత, కోట నరేష్, నాయకులు నందవరపు సోములు, ఎర్నాకుల జగదీష్, గుని శెట్టి నాగేశ్వరరావు, పిడుగు మంగలక్ష్మి, పప్పు రాజారావు, దాసరి శివ శంకర్రావు, గనగళ్ళ సత్య, నెక్కెళ్ళ సత్తిబాబు,ఎస్సీ నాయకులు చీ అప్పారావు, గాడి సత్యం గంట్యాడ ఆదినారాయణ, సతివాడ అప్పారావు, ముక్త రాజారావు చుక్క సింహాచలం, దువ్వాడ లక్ష్మీ భార్గవి, శ్రీదేవి అప్పల నరసమ్మ, ఉరుకుటి పైడ్రాజు తదితరులు పాల్గొన్నారు,



## ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

విజయనగరం (చైతన్యరథం): ముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా టీడీపీ కార్యాలయంలో వారి చిత్రపటానికి శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ కేంద్రమంత్రిగా దేశానికి ఎనలేని సేవలు అందించారని, వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, అణగారిన వర్గాలకోసం వారు చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అందరు వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకువెళ్లాలని అన్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి కి కేంద్ర ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు గారు వారి ఇంటి ముందర ముగ్గులు వేసి, "మన రాజధాని - మన అమరావతి" అని రాసి మద్దతు తెలిపారు.

# దేశాభివృద్ధికి జగజ్జీవన్ రామ్ సేవలు ఎనలేనివి



మండపేట (చైతన్యరథం): దేశాభివృద్ధికి, దళితుల అభ్యున్నతికి భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ అందించిన సేవలు ఎనలేనివని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. జగజ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలను మండపేట లో ఆయన ఘనంగా నిర్వహించారు. తొలుత టీడీపీ కార్యాలయంలో బాబు చిత్ర పటానికి ఎమ్మెల్యే వేగుళ్ళ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుండి ఎన్.టి.ఆర్ సెంటర్, 7వ వార్డు, 8వ వార్డు లలో ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాలులు అర్పించారు. కేక్ కట్ చేసి, అందరికీ స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ దళిత అనగారిన వర్గాల అభ్యున్నతి కోసం మహనీయుడు డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ అలుపెరగని పోరాటం చేశారన్నారు. విద్యార్థి దశలోనే సామాజిక మార్పు కోసం ఆయన ఉద్యమించారన్నారు .అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని చట్ట ప్రకారంగా అమలు చేయించే భాధ్యతను కేంద్ర మంత్రిగా జగ్జీవన్ రామ్ తీసుకున్నారన్నారు. ఇలాంటి స్ఫూర్తిదాయకమైన నేతల ఆశయ సాధన కోసం ప్రతీ ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుంగ సంజయ్, ఎమ్మార్పీఎస్ నాయకులు ధూలి జయరాజు, 6వ వార్డు మాజీ కౌన్సిలర్ కాశిన కాశీ విశ్వనాథం, 7వ వార్డు మాజీ కౌన్సిలర్ సవరపు సతీష్, కొవ్వాడ అప్పన్నబాబు, పెందుర్తి ప్రదీప్, మోరంపూడి సుబ్రహ్మణ్యం, వల్లూరి ఇందిరా రాణి, వల్లూరి దొరకయ్య, ముమ్మిడివరపు నారాయణరావు, ఇజ్రాయిల్, దసరాజు, గంధం వెంకన్న, గంధం కళ్యాణ్, పాలచర్ల శిరీష్, శెట్టి రవి తదితరులు పాల్గొన్నారు.

## పదవులకన్నా ప్రజాసేవ గొప్పది

### ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): పదవులు గొప్పవి... శాశ్వతం కాదని... ప్రజలకు చేసిన సేవ గొప్పదని, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ ఆ కోవకు చెందిన వారేనని, అందుకే ఆయన్ను మనమంతా నేటికీ స్మరించుకుంటున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జవన్ రామ్ 119వ జయంతిని పురస్కరించుకుని నగరంలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన జయంతి కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. గోరక్షణపేట, బైపాస్ రోడ్డు, శారదనగర్, 49వ డివిజన్ సుబ్బారావు నగర్‌లో జరిగిన కార్యక్రమాలకు హాజరై బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అలాగే చర్చిపేట గేటు వద్ద అధికారికంగా నిర్వహించిన కార్యక్రమానికి హాజరై కలెక్టర్ కీర్తి చేకూరి, నగర పాలక సంస్థ కమిషనర్ రాహూల్ మీనాతో కలిసి బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల వద్ద స్థానిక పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, గొప్ప సామాజిక సంస్కర్త భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జవన్ రామ్ అని కొనియాడారు.

## మహనీయుడు జగ్జీవన్ రామ్


### ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కొత్తపేట (చైతన్యరథం): పేదరికంలో పుట్టి, స్వాతంత్ర సమరంలో పాల్గొని, రాజ్యాంగ రచనా సభ్యునిగా, దేశ ఉపప్రధానిగా మన దేశానికి సేవలందించిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అని, ఆయన బాటలో పయనించడం మనందరి కర్తవ్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా కొత్తపేటలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం బాబు జగ్జీవన్ రామ్ ఆ జీవన పర్యంతం పాటు పడ్డారని కొనియాడారు. సఫాయి కార్మికుల సంక్షేమం కోసం తన జీవితాన్ని పణంగా పెట్టి పని చేసిన వ్యక్తి జగ్జీవన్ రామ్ అన్నారు. 50 సంవత్సరాల పాటు పార్లమెంట్ సభ్యునిగా పనిచేసి రికార్డు సృష్టించారన్నారు. అట్టడుగు వర్గాలు,పేద వర్గాలు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలని వారు కోరుకున్నారని, అవన్నీ నేడు సాకారమవుతున్నాయన్నారు. వర్గీకరణతో అణగారిన వర్గాల్లో పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అందరూ బాగుండాలని ఆనాడు ఆ మహానుభావులు సంకల్పించారని, దాన్ని నేడు ప్రధాని నరేంద్ర మోడీ,ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల మార్గదర్శకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందరి అభివృద్ధి కోసం, ప్రధానంగా అట్టడుగున ఉన్న వర్గాల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి ముందుకు వెళ్తున్నాయన్నారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. ఈ కార్యక్రమంలో కూతమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ. 90 కోట్లతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### పార్వతీపురంలో మంత్రి నారాయణ వెల్లడి



పార్వతీపురం (చైతన్యరథం): పురపాలక సంఘానికి తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి 90 కోట్లు మంజూరు చేయడం జరిగిందని టెండర్లు కూడా పూర్తయ్యాయని మంత్రి నారాయణ వెల్లడించారు. ప్రతి ఇంటికి కుళాయి ద్వారా తాగునీరు అందించేందుకు కృషి జరుగుతోందన్నారు. డంపింగ్ యార్డు క్లియర్ చేస్తున్నామన్నారు. ల్యాండ్ ఇస్తే చెత్తాచెదారం ప్రతి రోజు రీసైకిల్ చేసి చెత్త లేకుండా చేస్తామన్నారు. రూ.15 కోట్లుతో 22 కిలోమీటర్లు డ్రైనేజ్ సిస్టమ్ కోసం నిధులు ఇస్తున్నామన్నారు. టిడ్కో ఇళ్ల వద్ద రోడ్ లు, లైట్స్ నిర్మించి లబ్దిదారులకు ఇస్తామన్నారు. పార్క్ డెవెలప్మెంట్ కు రూ. 1 కోటి నిధులు మంజూరు చేశారు. జూన్ నుంచి మున్సిపాలిటీ లో స్ట్రీట్ లైట్స్ మెయింటెన్స్ 8 ఏళ్ళు ప్రైవేట్ సంస్థ చూస్తోంది.. మున్సిపాలిటీ కి సంబంధం ఉండదన్నారు. కార్యక్రమంలో అమరావతి బిల్లు పార్లమెంట్ ఆమోదం సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యే కేక్ కట్ చేసి జై అమరావతి, జై తెలుగుదేశం, జై బీజేపీ, జై జనసేన అని నినాదాలు చేశారు. అనంతరం ఘనంగా కౌన్సిలర్స్ కు, డైరెక్టర్లకు, పట్టణ అధ్యక్షులకు, సన్మానం చేశారు



# ఏపీఎల్ చైర్మన్‌గా సుజయ్ కృష్ణ రంగారావు

## జూన్ మొదటి వారం నుంచిఆంధ్ర ప్రీమియర్ లీగ్ ప్రారంభం
## 2026 సీజన్ 5 నిర్వహణకు చక చకా ఏర్పాట్లు

విజయవాడ (చైతన్యరథం): ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ మొదటి వారం నుంచి ప్రారంభం కానున్న ఆంధ్ర ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ 5 నిర్వహణకు చక చకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) నిర్వహణ కోసం ప్రతి సీజన్ తరహాలోని ఈ సీజన్ కి కూడా గవర్నింగ్ కౌన్సిల్‌ను ఆదివారం విజయవాడలోని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన స్పెషల్ జనరల్ మీటింగ్ (ఎస్‌జీఎం)లో ఎన్నుకున్నారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ పరిధిలో ఉన్న ఓటింగ్ క్లబ్స్, డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ల ప్రతినిధులు గవర్నింగ్ కౌన్సిల్ ఎన్నికలలో పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకుని ఇద్దరు సభ్యులను ఎన్నుకున్నారు. విజయనగరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ నుంచి రావు వెంకట సుజయ్ కృష్ణ రంగారావు, కర్నూలు బ్లూస్ క్రికెట్ క్లబ్ నుంచి ఎం సురేంద్రవర్మ సభ్యులుగా 2026- 27 ఏపీఎల్ సీజన్ నిర్వహణ నిమిత్తం ఎన్నికయ్యారు. అనంతరం ఏసీఏ ప్రతినిధుల సమావేశం జరగగా ఆంధ్ర ప్రీమియర్ లీగ్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్‌గా సుజయ్ కృష్ణ రంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సభ్యులుగా ఎం సురేంద్ర వర్మ, సానా సతీష్ బాబు, డి శ్రీనివాస్, ఆర్ శ్యామ్, వైయస్ రంగనాథ్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా నిమ్మగడ్డ రమేష్ కుమార్ వ్యవహరించగా, ఎన్నికల నిర్వహణ, అనంతరం జరిగిన సమావేశంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనా (చిన్ని), కార్యదర్శి సానా సతీష్ బాబు, ఉపాధ్యక్షులు బండారు నరసింహారావు, ఏసీఏ కార్యనిర్వహక సభ్యులు పాల్గొన్నారు.

## తలాష్ స్టేట్ లెవెల్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణ

### పాల్గొన్న గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

పాడేరు (చైతన్యరథం): అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంలోని కిడారి క్యాంపు కార్యాలయంలో కాకినాడ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్, డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన నిర్వహించనున్న "తలాష్" స్టేట్ లెవెల్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ ఫెస్ట్ పోస్టర్‌ను రాష్ట్ర గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లోని సృజనాత్మకత మరియు ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఉమ్మడి గోదావరి జిల్లాలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కామర్స్ మేనేజ్మెంట్ విద్యార్థులు ఈ ఫెస్టివల్‌లో పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ ఎల్. మధు కుమార్, ఆదివాసీ విద్యార్థి సంఘం ప్రతినిధి జర్సింగి అనిల్ కుమార్, మాజీ జడ్పీటీసీ సుబ్బారావు, మాజీ సర్పంచ్ రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ 119 జయంతి

విశాఖపట్టణం (చైతన్యరథం): విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఈ కార్యక్రమంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు చోడే వెంకట పట్టాజీ రామ్, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చోడే వెంకట పట్టాబి రామ్ మాట్లాడుతూ వెనుకబడిన, అణగారిన వర్గాల జీవితాన్ని అంకితం చేసిన మహానాయకుడు, తొలి దళిత భారత ప్రధాని "బాబూజీ" గా కీర్తించబడిన నేత జగ్జీవన్ అని అన్నారు. తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి దళితులకు న్యాయం చేసిందని గొప్ప గొప్ప పదవులు తెలుగుదేశం పార్టీ ఇచ్చిందని అన్నారు. అసెంబ్లీ స్పీకర్ గా ప్రతిభ భారతి పార్లమెంట్ స్పీకర్‌గా బాలయోగి ఉన్నత పదవులు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు బుడుమూరి గోవింద్, ప్రధాన కార్యదర్శి పి జయరాజ్ జాన్, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పొడుగు కుమార్, కార్పొరేషన్ డైరెక్టర్ ఇతలపాక సుజాత, కోట నరేష్, నాయకులు నందవరపు సోములు, ఎర్నాకుల జగదీష్, గుని శెట్టి నాగేశ్వరరావు, పిడుగు మంగలక్ష్మి, పప్పు రాజారావు, దాసరి శివ శంకర్రావు, గనగళ్ళ సత్య, నెక్కెళ్ళ సత్తిబాబు,ఎస్సీ నాయకులు చీ అప్పారావు, గాడి సత్యం గంట్యాడ ఆదినారాయణ, సతివాడ అప్పారావు, ముక్త రాజారావు చుక్క సింహాచలం, దువ్వాడ లక్ష్మీ భార్గవి, శ్రీదేవి అప్పల నరసమ్మ, ఉరుకుటి పైడ్రాజు తదితరులు పాల్గొన్నారు,



# ప్రపంచ స్థాయి గజదొంగ జగన్!

## మాజీమంత్రి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజం



చిలకలూరిపేట (చైతన్యరథం): ప్రపంచ స్థాయి గజదొంగ జగన్ పజా రాజధాని అమరావతిని కరప్షన్ క్యాపిటల్ అని దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ధ్వజమెత్తారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాజధాని నిర్మాణంపై జగన్ చిమ్మే ప్రతి విషపు బొట్టు తన పతనానికి తానే వేసుకునే మెట్టుగా మారుతుందన్నారు. కూటమిప్రభుత్వ రాజకీయ చతురతతో, కేంద్రప్రభుత్వ సహకారంతో అమరావతికి చట్టబద్ధత లభించడం.. రాజధాని నిర్మాణం ఊపందుకోవడం.. ప్రజల ఆశలు, ఆకాంక్షలు సాకారం కానుండటంతో, జగన్ వైసీపీనేతలకు తమ రాజకీయ జీవితాలపై నీలినీడలు కమ్ముకున్నాయన్నారు. పట్టువదలని విక్రమార్కుడిలా ముఖ్యమంత్రి చంద్రబాబు అనుకున్న సమయానికి అమరావతిని పూర్తిచేస్తే, తమకు రాజకీయ సన్యాసం తప్పదనే జగన్ ముఠా రోజుకో కొత్త దుష్ప్రచారాన్ని తెరపైకి తెస్తోందన్నారు. రాజధాని నిర్మాణానికి రూ.2లక్షల కోట్లు అవుతుందని, ప్రజలపై అప్పలభారం పడుతుందని జగన్.. వైసీపీనేతలు పగటికలలు కంటున్నారా? లేక ఆత్మలు చెప్పిన ఆర్థిక శాస్త్ర నిబంధనల ప్రకారం మాట్లాడుతున్నారా? స్వతంత్ర ఆడిట్ సంస్థ, న్యాయ విచారణ విభాగాలు ఏవీ చెప్పకుండా రాజధానితో రాష్ట్రంపై అదనపు ఆర్థిక భారం పడుతుందని వైసీపీనేతలు ఎలా చెబుతారని ప్రశ్నించారు. రియల్ స్కామ్‌లు షెల్ కంపెనీలు, మనీ లాండరింగ్‌లు, ఈడీ, సీబీఐల కళ్లకు గంతలు కట్టే ఘరానా విద్యల్లో ఎప్పటికీ ఘనాపాటి జగనే అనే పచ్చి నిజాన్ని వైసీపీ నేతలు గ్రహించాలన్నారు. పచ్చకామెర్ల రోగిలా..అవినీతి సామ్రాట్ కు అన్నింట్లో అవినీతే కనిపిస్తుంది..జగన్ రెండు కళ్లు అవినీతి..దోపిడీ... పచ్చకామెర్ల రోగికి లోకం పచ్చగా కనిపించినట్టు.. అవినీతి సామ్రాట్ జగన్ కు ప్రజా సంక్షేమం అభివృద్ధి సహా అన్నింటా అవినీతే కనిపిస్తుంది.ఎడారి, శ్మశానంలో అవినీతి..దోపిడీ ఎలా సాధ్యమో వైసీపీ నేతలే చెప్పాలని ఎద్దేవా చేశారు. అమరాతి రైతుల ఉద్యమం ప్రభావంతో గత ఎన్నికల్లో ప్రజలు అరగుండు గీసినా జగన్ ముఠా దుష్ప్రచార పంథా మారలేదు. తమ నాయకుడు ఆయన అవినీతి మీడియా అసత్యాల్ని నమ్మి వైసీపీనేతలు మాట్లాడితే ప్రజల చేతిలో వారికి మరోసారి భారీ భంగపాటు ఖాయమన్నారు. ప్రపంచం గర్వించే ప్రజా రాజధాని అమరావతిని స్వాగతిస్తేనే తమకు రాజకీయ మనుగడ అనే సత్యాన్ని వైసీపీ నేతలు గ్రహించాలి." అని మాజీమంత్రి ప్రత్తిపాటి ఆదివారం ఒక ప్రకటనలో హితవు పలికారు.

# చిరస్మరణీయుడు స్వర్గీయ బాబూ జగ్జీవన్‌రామ్

## నివాళులర్పించిన ఎమ్మెల్యే గళ్లా మాధవి



గుంటూరు (చైతన్యరథం): పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మాజీ ఉప ప్రధాని స్వర్గీయ డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ 119వ జయంతి వేడుకలు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎన్డీయే కూటమి నేతలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని "సమతా దివస్"గా జరుపుకోవడం ఆయన సమానత్వం కోసం చేసిన విశేష కృషికి నిదర్శనమని కొనియాడారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఆయన కార్మిక శాఖ మంత్రిగా కార్మిక చట్టాల్లో సంస్కరణలు, ఫుడ్ మినిస్టర్‌గా గ్రీన్ రివల్యూషన్‌కు చేసిన సేవలు, రక్షణ శాఖ మంత్రిగా ఇండో, పాక్ యుద్ధ సమయంలో చూపిన నాయకత్వం, ఉప ప్రధానిగా దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. భావితరాలకు ఇలాంటి మహనీయుల గురించి అవగాహన కల్పించడం అవసరమన్నారు. స్కూళ్లలో వ్యాసరచన కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు సూచించారు. "దేశాన్ని కాపాడేది కేవలం సైనికుడే కాదు, సమాజంలో దేశ గౌరవాన్ని నిలబెట్టే ప్రతి ఒక్కరూ సైనికులే" అనే బాబూ జగ్జీవన్ రామ్ సందేశాన్ని స్మరించుకుంటూ, ప్రతి ఒక్కరూ దేశ ప్రతిష్టను పెంపొందించేలా ప్రవర్తించాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు.

# అణగారినవర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్ రామ్: ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): భారత మాజీ ఉప ప్రధాని, ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు బాబూ జగ్జీవన్‌రామ్ జీవితం ఆదర్శప్రాయమని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఎస్సీ సెల్ నాయకుల ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే నసీర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు బాబూ జగ్జీవన్ రామ్ అని కొనియాడారు. చిన్నతనం నుంచే పోరాట పటిమ కలిగి ఉండేవారని తెలిపారు. అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమించి, ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని, సుదీర్ఘ కాలం పార్లమెంటేరియన్‌గా ప్రజలకు మెరుగైన సేవలు అందించారని పేర్కొన్నారు. నేటి యువత బాబూ జగ్జీవన్ రామ్ స్ఫూర్తిని కొనసాగించాలని చెప్పారు. జగ్జీవన్ రామ్ ఆశయ సాధన కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. కేవలం స్వాతంత్ర్య పోరాటయోధునిగానే కాకుండా బడుగు, బలహీన వర్గాలకు విద్యను చేరువ చేయాలనే దృఢ సంకల్పంతో పని చేశారని తెలిపారు. ఆయన మార్గంలోనే రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తున్నామని, విద్యా వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చామని అన్నారు. ఇలాంటి నాయకులు భావితరాలకు మార్గదర్శంగా నిలుస్తారని చెప్పారు.



# జగ్జీవన్‌రామ్ జీవితం యువతకు ఆదర్శం

## పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ నివాళులు

పెనమలూరు (చైతన్యరథం): నియోజకవర్గంలోని తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని యనమలకుదురు గ్రామంలో స్వర్గీయ బాబూ జగజ్జీవన్ రామ్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పాల్గొన్నారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం తాడిగడప సెంటర్‌లో జగజ్జీవన్ రామ్, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించి బహుజన సోదరులకు జయంతి శుభాకాంక్షలు తెలిపారు... ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ,స్వతంత్ర సమరయోధుడిగా, క్రమశిక్షణ కలిగిన దళిత నాయకుడిగా కేంద్ర ప్రభుత్వంలో 30 సంవత్సరాలుగా ఎంపీగా మంత్రిగా బాధ్యతలు నిర్వహించారన్నారు. 1977 ప్రపంచ యుద్ధం సమయంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిగా సేవలు అందించి,1979లో కేంద్రంలో ఉప ప్రధానిగా పని చేసిన ఏకైక దళిత నాయకుడిగా గుర్తింపు పొంది,దేశంలో దళితులకు దిక్సూచిగా చరిత్రలో గుర్తుండిపోయే వ్యక్తిత్వం బాబూ జగజ్జీవన్ రామ్‌దని అన్నారు. నేటి యువత ఆయన జీవిత చరిత్రను మార్గదర్శకంగా తీసుకుని ఉన్నత స్థాయిలోలోకి రావాలని ఆకాంక్షించారు... ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ 119వ జయంతి

## నివాళులర్పించిన ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కలెక్టర్ లక్ష్మీశా

విజయవాడ (చైతన్యరథం):భారత మాజీ ఉప ప్రధానమంత్రి బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతి సందర్భంగా రామవరప్పాడు రింగ్ వద్ద ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పుష్పమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, భారత రాజకీయాల్లో బాబు జగ్జీవన్ రామ్ పాత్ర అజరామరమని కొనియాడారు. వెనుకబడిన వర్గం నుంచి వచ్చి, ఎన్నో సామాజిక అడ్డంకులను అధిగమించి దేశ ఉప ప్రధానిగా ఎదిగిన ఆయన జీవితం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఆనాటి రాజకీయ పరిస్థితుల వల్ల ఆయనకు బలం నిరూపించుకునే అవకాశం లభించలేదని, లేకపోతే దేశ ప్రధానిగా సేవలందించే అవకాశం ఉండేదని తెలిపారు. చరిత్రలో ఆయనకు కొంత అన్యాయం జరిగినప్పటికీ, ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు. జిల్లా కలెక్టర్ లక్ష్మీశా మాట్లాడుతూ, బాబు జగ్జీవన్ రామ్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గం నుంచి వచ్చిన వ్యక్తి ఉన్నత శిఖరాలను అధిరోహించడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఎన్టీఆర్ జిల్లాలో సామాజిక న్యాయం సాధనకు కట్టుబడి ఉన్నామని, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్య, ఆరోగ్యం, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో వెనుకబడిన వర్గాలను ప్రోత్సహిస్తూ 'స్వర్ణాంధ్ర' మరియు 'వికసిత భారత్' లక్ష్యాల సాధనకు కృషి చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# అమరావతి బిల్లు ఆమోదం, చారిత్రక విజయం

## కొడవలూరులో టీడీపీ నాయకుల భారీ ర్యాలీ

కోవూరు (చైతన్యరథం): అమరావతిని ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా గుర్తిస్తూ పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందడంపై కోవూరు నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు కొడవలూరు మండల కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ర్యాలి నిర్వహించారు. అమరావతి మన రాజధాని అంటూ కార్యకర్తల నినాదాలతో కొడవలూరు గ్రామ వీధులు మారు మోగాయి. చారిత్రాత్మకమైన అమరావతి బిల్లును పార్లమెంటులో ఆమోదించేలా కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్రంలోని కూటమి ప్రభుత్వ నేతలకు ఈ సందర్భంగా మండల టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. అమరావతి మన రాష్ట్ర శాశ్వత రాజధాని దీనిని ఎవరూ మార్చలేరని టీడీపీ నాయకులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల స్థాయి నాయకులు, భారీ సంఖ్యలో కార్యకర్తలు మరియు సామాన్య ప్రజలు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.



# పార్వతీపురంలో అభివృద్ధి పనుల జాతర

## రోడ్డు పనులకు మంత్రి జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే విజయ్ చంద్ర శంకుస్థాపన, ప్రారంభోత్సవం

పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం నియోజకవర్గం, బలిజిపేట మండలంలో రోడ్డు పనులకు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. బలిజిపేట మండలంలోని మిత్తి వలస నుండి అరసాడ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన చేసారు. అలాగే పనుకువలసనుండి నారాయణ పురం వరకు నిర్మించిన నూతన రోడ్డును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు , మంత్రి బిసి జనార్ధనరెడ్డికి, ఎమ్మెల్యే విజయ్ చంద్రకు ఘనస్వాగతం పలికారు. వారితో కలిసి మోటార్ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయచంద్ర

# అనంతలో ప్రతిధ్వనించిన అమరావతి నినాదం

అనంతపురం (చైతన్యరథం): అర్బన్ టీడీపీ కార్యాలయం వద్ద జై అమరావతి అన్న నినాదం ప్రతిధ్వనించింది. ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో టీడీపీ కార్యాలయం ఆవరణంలో అమరావతి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మాజీ మేయర్, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్ కోవెలమూడి రవీంద్ర(నాని) పాల్గొన్నారు. కార్యాలయం ఎదుట అందమైన ముగ్గులు వేశారు. జై అమరావతి అని రాస్తూ..రంగులతో ముగ్గులు వేశారు. సాయం సంధ్య వేళ ముగ్గులపై దీపాలు వెలిగించి ఒక పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ సంబరాల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి, కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో అమరావతి స్ఫూర్తి కనిపిస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వం రాకముందు వరకు అమరావతిపై ఒక స్తబ్దత కనిపించిందని.. మన రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితి ఉండేదన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో అసెంబ్లీలో తీర్మానం చేసి ఇప్పుడు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడం పట్ల ప్రతి ఒక్కరిలోనూ ఆనందం కనిపిస్తోందన్నారు. ఈ ఆనంద క్షణాలు అందరూ పంచుకునేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా తమ ఇంటి వద్ద అమరావతి ముగ్గులు వేస్తూ కనిపిస్తుండటం చూస్తుంటే వారిలో రాజధానిపై ఎంత ప్రేమ ఉందన్నది అర్థమవుతోందన్నారు.






## ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్‌కు నివాళులు

గూడూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య, గూడూరు మండలం గూడూరు పంచాయతీ కాగిత వెంకట్రావు కాలనీలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన పెడన శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య గారు ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ కులం లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు బాబూ జగ్జీవన్ రామ్ అన్నారు. పార్లమెంటులో 40 ఏళ్ల పాటు వివిధ మంత్రి పదవులు, ఉప ప్రధానిగా వ్యవహరించి నిర్వహించిన పదవులకు వన్నె తెచ్చిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## అమరావతి అజేయం.. అజరామరం!

కొవ్వూరు (చైతన్యరథం): అమరావతి శాశ్వత రాజధానిగా చట్టబద్దత కలిగినందుకు సంఘీభావంగా కొవ్వూరు లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వర రావు సూచనల మేరకు ముగ్గులుపెట్టి రంగులతో దిద్దారు. ఈ కార్యక్రమంలో టూమెన్ కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ , మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



# వైసీపీ విధ్వంసక పాలనను చరిత్ర మరచిపోదు

## విరుచుకుపడిన టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు

విజయవాడ (చైతన్యరథం): టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతి అంశం, రాజధాని అభివృద్ధి, రైతుల పోరాటం తదితర విషయాలపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. 1631 రోజులు రైతులు, మహిళలు చేసిన పోరాటం అమరావతిని అజరామరంగా నిలిపిందని ఆయన పేర్కొన్నారు. బిల్లుకి తీర్మానానికి తేడా తెలియకుండా తాడేపల్లిలో కూర్చుని ప్రెస్ మీట్‌లు పెడుతున్నారని విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో విజయవాడను ఏం ఉద్ధరించారో చెప్పాలని ప్రశ్నించారు. శాసనమండలిలో వైసీపీ సభ్యులు నాటి చైర్మన్ షరీఫ్ పట్ల ఏ విధంగా వ్యవహరించారో ప్రజలు చూశారని గుర్తుచేశారు. న్యాయస్థానం టు దేవస్థానం పాదయాత్ర చేస్తున్న మహిళల పట్ల వ్యవహరించిన అరాచకాలను మరిచిపోయారా అని ప్రశ్నించారు. దేశంలో ఉన్న అన్ని పార్టీలు అమరావతి బిల్లుకు పార్లమెంటులో ఏకగ్రీవంగా ఆమోదం తెలిపితే, మాట్లాడటానికి కూడా సిగ్గుపడి వైసిపి వాకౌట్ చేసిందని విమర్శించారు. రాజధానిలో జరుగుతున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక వైసీపీ నేతలు బ్రతుకుతెరువు కోసం అమరావతిపై విషం చిమ్మడం మొదలుపెట్టారని ఆరోపించారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో సాగించిన విధ్వంసక పాలన చరిత్రలో మరిచిపోలేనిదని అన్నారు. వైసీపీ ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మెచ్చే రాజధానిగా అమరావతి రూపుదిద్దుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ కూటమి ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. ఎర్ర బస్సు కూడా రాని భోగాపురానికి ఎయిర్‌పోర్టు ఎందుకు అన్నారు అంటూ వైసీపీపై విమర్శలు గుప్పించారు. వైసీపీ విధ్వంస పాలనలో దెబ్బతిన్న పోలవరం పనులు కూటమి ప్రభుత్వంలో పరుగులు పెడుతున్నాయని తెలిపారు.



చైతన్యరథం

# ఏపీ సమగ్రాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం (చైతన్యరథం): స్థానిక రామ్‌నగర్‌లోని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజా సమస్యల పరిష్కరణకు "ప్రజాదర్బార్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనంతపురం జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు, నాయకులు సమస్యలను స్వయంగా విన్న మంత్రి వారి నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ప్రజల సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తమ ప్రభుత్వానికి అభివృద్ధి సంక్షేమం రెండూ సమానంగా ముఖ్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పేదవారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా సమర్థవంతమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తూ, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం దిశగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు .రాష్ట్రాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.



# చిరస్మరణీయుడు జగ్జీవన్‌రామ్

## జయంతి సందర్భంగా నివాళులు అర్పించిన మంత్రి సవిత

పెనుకొండ (చైతన్యరథం): స్వాతంత్ర్య సమరయోధుడిగా, ప్రముఖ సంఘసంస్కర్తగా, తన పరిపాలన దక్షతతో దేశానికి విశేష సేవలు అందించిన భారత మాజీ ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్ రామ్ చిరస్మరణీయుడని మంత్రి సవిత కొనియాడారు. డాక్టర్ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పెనుకొండ క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, సమాజంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు

## అనంతపురం ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి వెల్లడి



అనంతపురం (చైతన్యరథం): భావితరాలకు స్ఫూర్తి నింపే విధంగా వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు చేస్తామని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకట ప్రసాద్ వెల్లడించారు. నగరంలో వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. పీటీసీ కాలేజీ వద్ద ఘనంగా వడ్డే ఓబన్న విగ్రహానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. వడ్డెర సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ హాజరయ్యారు. నగరంలో వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు చేయాలని మూడేళ్లుగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. స్థలం అనువైన చోటు లేక ఇన్ని రోజులు ఆటంకాలు ఏర్పడ్డాయన్నారు. ఇప్పుడు పీటీసీ కాలేజీ వద్ద విగ్రహ ఏర్పాటుకు అన్ని అనుమతులు వచ్చాయన్నారు. పార్టీలకతీతంగా వడ్డెర సంఘం నాయకులు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇందుకు తన వంతుగా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నగరంలో వడ్డెర భవన్ ఏర్పాటుకు అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే వడ్డెర భవన్ నిర్మాణం జరుగుతుందన్నారు. వడ్డెర్లకు మా సహకారం ఎప్పటికీ ఉంటుందని భరోసా ఇచ్చారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ఐక్యంగా ముందుకు నడవాల్సిన అవసరం ఉందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. అందుకు తమవంతుగా సహకారం అందిస్తామన్నారు.




# ఇకనైనా విషం కక్కడం మానండి

## వైసీపీ నేతలకు ఎమ్మెల్యే బండారు హితవు

శింగనమల (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు ప్రజా రాజధాని అమరావతికి చట్టబద్ధత వచ్చిన సందర్భంగా పార్లమెంటులో సహకరించిన పార్టీలకు, నేతలకు, భారతదేశ ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తు అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గ శాసనసభ్యురాలు బండారు శ్రావణి శ్రీ ఆదేశాల మేరకు శింగనమల గ్రామపంచాయతీ నాయి బ్రాహ్మణ కాలనీలో ఏపీ నాయి బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమం రాష్ట్ర డైరెక్టర్ ఎం ఆదినారాయణ దీపాలు వెలిగించి ప్రజా రాజధాని అమరావతికి దీపహారతులు ఇచ్చారు. అమరావతి బిల్లుకు ఉభయ సభలలో ఆమోదం లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇది ప్రజా రాజధాని అని.. నా రాజధాని అమరావతి అంటూ గర్వంగా చాటాలని పిలుపునిచ్చారు. ఇది ప్రజా ప్రభుత్వం సాధించిన విజయం. రాష్ట్ర రాజధాని అమరావతి పై వైసీపీ నేత జగన్ విషం కక్కడం మానాలి, ప్రజలు కోరిన ప్రజా రాజధానికి మద్దతు పలికేందుకు జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకుంటున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అమరావతి రాజధానికి సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.



అమరావతి ముగ్గు వేయించి మురిసిపోతున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

# నగరానికి ఇక తాగునీటి సమస్య ఉండదు

## మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడి



అనంతపురం (చైతన్యరథం): కూడేరు మండలం ముద్దలాపురం వద్ద 16 ఎం.ఎల్.డి వాటర్ ప్లాంట్ ప్రారంభం మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా వాటర్ ప్లాంట్ ప్రారంభమయ్యింది. నగర వాసులకు శాశ్వతంగా తాగునీటి పరిష్కారం చూపిస్తున్నామని ఎమ్మెల్యే దగ్గుపాటి చెప్పారు. 2017 లోనే15 కోట్లతో ఈ పనులు ప్రారంభించామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలకులు దీనిని పూర్తి చేయలేకపోయారన్నారు. 20 నెలల్లోనే దీనిని పూర్తి చేశామన్నారు. మూడు నెలల పాటు ట్రైల్ రన్ నిర్వహించామని, ప్రజలకు సురక్షితమైన నీరు అందించడమే తమ లక్ష్యమని చెప్పారు. రాయలసీమను 30 వేల కోట్లతో హార్టికల్చర్ హబ్‌గా మార్చబోతున్నారన్నారు. రాయలసీమ వ్యవస్థాయ స్థితిగతులు మారబోతున్నాయని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. కేవలం 100 రోజుల్లోనే హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి కుప్పం వరకు నీరు తీసుకెళ్లారన్నారు. ఇది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారను. 16ఎంఎల్డీ వాటర్ ప్లాంట్ పూర్తికావడంలో దగ్గుపాటి కృషిని అభినందించారు. ఐదేళ్లలో ఈ వాటర్ ప్లాంట్ నిర్లక్ష్యానికి గురైందన్న మంత్రి ఎన్డీఏ ప్రభుత్వానికి ఓటు వేసినందుకు ప్రజలకు అన్ని విధాలుగా మేలు చేస్తున్నామన్నారు. వైసీపీ ఎందులోనూ తమతో డిబేట్ కు వచ్చే అవకాశం లేదన్నారు. మిగిలిన మున్సిపాలిటీలకు తాగునీరు అందించేందుకు 700 కోట్లు కేటాయించామన్నారు. హంద్రీనీవాకు గత ఏడాది బడ్జెట్లో 3800 కోట్లు కేటాయించాం ఈ ఏడాది మరో 2000 కోట్లు కేటాయించామని వెల్లడించారు. కేవలం కేటాయింపులు మాత్రమే కాదు పనులు చేసి చూపించామన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు 30 వేల కోట్లు కేటాయించామని కేంద్రం కూడా ఈ ప్రాజెక్టు విషయంలో సానుకూలంగా ఉందని వెల్లడించారు.

# సిడ్నీలో జయహో అమరావతి







సిడ్నీ (ఆస్ట్రేలియా): అమరావతిని శాశ్వత రాజధానిగా చేస్తూ పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడంపై ఆస్ట్రేలియా ఎన్ఆర్ఐ టీడీపీ విభాగం ఆధ్వర్యంలో సిడ్నీ మార్స్ డెన్ పార్కులో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జై అమరావతి నినాదాలతో ఆ ప్రాంతం మారుమోగింది. అమరావతి రైతుల త్యాగాలకు గుర్తుగా దీపాలను ప్రదర్శించారు. అరాచక మూకల కుట్రలకు ఎదురొడ్డి నిలబడి అమరావతి ఆత్మగౌరవం గెలిచింది..పార్లమెంటు చట్టబద్ధతతో రాజధానికి తిరుగులేని శాసనం దక్కింది..దేవతల రాజధాని అమరావతి అజరామరం..ఇక ఎవరూ దానిని కదల్చలేరని నాయకులు పేర్కొన్నారు. 5 కోట్ల ఆంధ్రుల కలలను సాకారం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్అర్ఐ టీడీపీ నేతలు విజయ్ చెన్నుపాటి, సతీష్ గద్దె, శ్యామ్ ప్రసాద్ కోడూరి, శ్రీనివాస్ పల్లపోతు, మనోజ్ యండపల్లి, రంజిత్ కావూరి, ప్రసాద్ మందలపు, శశి ఆలపాటి, నారాయణ పెద్దిరెడ్డి, రవి తరగంబాడి, సురేంద్ర అన్నే, నవీన్ కొండబోలు, అజిత్ వీరపనేని, సుభాష్ నిమ్మగడ్డ, బాలకృష్ణ కొండేపాటి, సతీష్ పొట్లూరి, మణి కోడూరి, ఎన్ఆర్ఐ టీడీపీ విభాగం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## రియాద్‌లో అమరావతి సంబరాలు

రియాద్ (సౌదీ అరేబియా): ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో సౌదీ అరేబియాలోని రియాద్‌లో టీడీపీ, జనసేన అభిమానులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా "జై అమరావతి, జై జై అమరావతి" అని నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఏపీ శాశ్వత రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించడం ఎంతో ఆనందంగా ఉంది. అందుకోసం కృషిచేసిన ప్రధాని మోదీ, చంద్రబాబు, యువనేత లోకేష్, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌కు కార్యక్రమ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్అర్ఐ టీడీపీ సభ్యులు తిరుపతి స్వామి స్వర్ణ (స్వామి), మహేంద్ర వాకాటి, మోహన్ గురజాల, శివ దబ్బకూటి, హరీష్, రవి మేడూరి, మధు తదితరులతో పాటు మహిళా సభ్యులు శ్రీదేవి వాకాటి, జ్యోతి, విద్య, మణి, శిరీష జనసేన అభిమానులు రాంబాబు బండి, ప్రగతి పాల్గొన్నారు.





## సెయింట్ లూయిస్ నాట్స్ ఆధ్వర్యంలో
# ఉచిత వైద్యశిబిరం

తోటి తెలుగు వారికి అండగా నిలవాలన్న తపన, నిస్వార్థ సేవాభావంతో పనిచేస్తున్న ఉత్తర అమెరికా తెలుగు సంఘం నాట్స్... తాజాగా సెయింట్ లూయిస్‌లో 'ఉచిత వైద్య శిబిరం' నిర్వహించింది. మిస్సోరీ నాట్స్ విభాగం నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరం నాట్స్ సేవా నిరతిని చాటింది. ఈ వైద్య శిబిరానికి నాట్స్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ డాక్టర్ సుధీర్ అట్లూరి తమ వృత్తిపరమైన బాధ్యతను సేవా దృక్పథంతో జోడించి విశేష సేవలందించారు. శిబిరానికి వచ్చిన రోగులను ఆప్యాయంగా పలకరిస్తూ, వారి ఆరోగ్య సమస్యలను ఓపికగా విని, తగిన వైద్య పరీక్షలు నిర్వహించి సరైన సూచనలు అందించారు. ఈ కార్యక్రమం ఇంత విజయవంతం కావడంలో నాట్స్ నాయకత్వం అడుగడుగునా సహకారం అందించింది. నాట్స్ ప్రస్తుత బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ రమేష్ బెల్లం, నాట్స్ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ మంచికలపూడి, మిస్సోరీ చాప్టర్ కోఆర్డినేటర్ సందీప్ కొల్లిపర దగ్గరుండి అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. వారు నాట్స్ నాయకులుగా మాత్రమే కాకుండా, సామాన్య సేవకులుగా అందించిన సహకారం ఈ వైద్య శిబిరాన్ని విజయవంతం అయ్యేలా చేసింది. నాట్స్ నాయకులతో పాటు స్థానిక వాలంటీర్లు కూడా ఈ వైద్య శిబిరంలో ఉత్సాహంగా సేవలు అందించారు. తోటివారి కోసం సమయాన్ని, శ్రమను వెచ్చించి నాట్స్ చేసిన ఈ నిస్వార్థ సేవకు స్థానికుల నుంచి ప్రశంసలు లభించాయి. ఇలాంటి మరిన్ని కార్యక్రమాలతో నాట్స్ తమ సేవా ప్రయాణాన్ని కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు. నాట్స్ మిస్సోరీ ఉచిత వైద్యశిబిరంలో నిర్వహణలో పాల్గొన్న ప్రతిఒక్కరికి నాట్స్ చైర్మన్ కిషోర్ కంచర్ల, నాట్స్ అధ్యక్షుడు శ్రీహరి మందాడి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## మలేషియాలో
# 'ఉగాది గీతాంజలి'

- సాంస్కృతిక ఐక్యతకు వేదికగా కార్యక్రమం
- ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు
- కళాకారులకు ఘన సత్కారం



మలేషియా: మలేషియాలోని బ్రిక్‌ఫీల్డ్స్‌లో ఉగాది గీతాంజలి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచింది. మలేషియా తెలుగు ఫౌండేషన్ (ఎంటీఎఫ్), మన సంస్కృతి ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుక, భారతీయ శాస్త్రీయ కళల గొప్పతనాన్ని ప్రతిబింబిస్తూ మలేషియా-భారత దేశాల మధ్య ఉన్న సాంస్కృతిక అనుబంధాన్ని మరింత బలోపేతం చేసింది. ఈ కార్యక్రమానికి మలేషియా తెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు డాటో కాంతారావు, భారతదేశంలోని మన సంస్కృతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ప్యారిస్‌లోని ఇండియన్ డాన్స్ కౌన్సిల్ సీఐడీ సభ్యురాలు శాంతి కొమ్మమూరి ప్రధాన భూమిక పోషించారు. మలేషియా-భారత సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాల భాగంగా నిర్వహించిన ఈ వేడుక రెండు దేశాల మధ్య కళాత్మక సహకారాన్ని ప్రోత్సహించే దిశగా సాగింది. ఈ వేడుకలో భారతదేశం నుంచి వచ్చిన చిన్నారుల శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాలుగేళ్ల వయసు నుంచి ఉన్న ఈ చిన్నారులు రంగస్థలంపై అడుగుపెట్టిన ఈ బాల నృత్య కళాకారులు, తమ అద్భుత ప్రతిభతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. వారికి సర్టిఫికెట్లు, స్మారక చిహ్నాలు అందజేసి సత్కరించారు. ఈ సత్కార కార్యక్రమాన్ని ఫెడరేషన్ ఆఫ్ ఎన్నారై కల్చరల్ అసోసియేషన్స్ మలేషియా అధ్యక్షుడు బురెడ్డి మోహన్ రెడ్డి, మలేషియా తెలుగు ఎక్స్‌పాట్స్ అసోసియేషన్ కోశాధికారి నాగరాజ సూర్యదేవర, సమాజ నాయకులు డాటో సూర్యప్రకాష్ నిర్వహించారు. తెలుగు నూతన సంవత్సరమైన ఉగాది సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం కేవలం పండుగ సంబరాలకే పరిమితం కాకుండా మలేషియా, భారతీయ సమాజాల మధ్య సాంస్కృతిక ఐక్యతకు వేదికగా నిలిచింది.







# మీకు కౌంట్‌డౌన్ మొదలైంది

కూచ్‌బిహార్: పశ్చిమబెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మరింత వెడెక్కింది. కూచ్‌బిహార్‌లో ఆదివారం జరిగిన మెగా ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. పశ్చిమబెంగాల్‌లోని మాల్దా, సందేశ్‌కాళి ఘటనలపై ప్రధాని విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో 'మహా ఆటవిక రాజ్యం' నడుస్తోందని, ఈ ఘటనలను టీఎంసీ బాధ్యత వహించాలని అన్నారు. బెంగాల్‌లో మమతా బెనర్జీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని పేర్కొన్నారు.

**మమత మూల్యం చెల్లించుకోవాలి**

సుప్రీంకోర్టు జోక్యం చేసుకున్నప్పటికీ పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితి చాలా దారుణంగా తయారైందని ప్రధాని విమర్శించారు. బెంగాల్ ప్రజలను టీఎంసీ లూటీ చేసిందని, మే 4న ఫలితాలు వచ్చిన తర్వాత టీఎంసీ ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హితవుపలికారు.

**చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్**

కేంద్రలోని బీజేపీ ఇంతవరకూ 3 లక్షల మంది సోదరీమణులను కరోడ్‌పతి దీదీలను చేసిందని, దేశం కోసం తీసుకుంటున్న నిర్ణయాల్లో మహిళలకు ప్రాధాన్యం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇందుకోసం తమ ప్రభుత్వం మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో 33 శాతం రిజర్వేషన్ కల్పించే చట్టం తెచ్చిందని చెప్పారు. ఇందువల్ల 2020 లోక్‌సభ ఎన్నికల నుంచి పశ్చిమబెంగాల్‌తో సహా దేశవ్యాప్తంగా మహిళలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఏప్రిల్ 16,17,18 తేదీల్లో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు జరుపుతున్నామని చెప్పారు.

- జడ్జీలకే రక్షణ కల్పించలేకపోయారు
- మమతా ప్రభుత్వంపై మోదీ ఫైర్

మన తల్లులు, సోదరీమణులకు 40 ఏళ్లుగా చట్టసభల్లో రిజర్వేషన్ హక్కు లేకుండా పోయిందని, ఇంకా జాప్యం జరగడం సరికాదని అన్నారు. జనాభా నియంత్రణను సమర్ధవంతంగా అమలు చేసిన రాష్ట్రాలకు ఇందువల్ల ఎలాంటి నష్టం జరగదని, అన్ని రాష్ట్రాలు, అందరి హక్కుల పరిరక్షణ జరుగుతుందని భరోసా ఇచ్చారు.



**టీఎంసీ సిండికేట్‌కు భయపడొద్దు**

పోలింగ్ రోజున టీఎంసీ గూండాలకు భయపడవద్దని, చట్టాన్ని నమ్మండని మోదీ కోరారు. మే 4న టీఎంసీ పాలన ముగియగానే ఆ పార్టీ గూండాలు, సిండికేట్లపై చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. చొరబాటుదారులను కాపాడేందుకే ఎస్ఐఆర్ ప్రక్రియను టీఎంసీ వ్యతిరేకిస్తోందని, రాబోయే ఎన్నికలు టీఎంసీ భవిష్యత్తును నిర్ణయించనున్నాయని, ప్రజలు బీజేపీకి ఓటు వేయాలని కోరారు. 2026 అసెంబ్లీ ఎన్నికలను ఎన్నికల కమిషన్ స్వేచ్ఛగా, సజావుగా నిర్వహిస్తుందనే నమ్మకం తనకు ఉందని అన్నారు. కాగా, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతలుగా జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# సీఎం భార్యకు మూడు పాస్‌పోర్ట్‌లు

### ఆరోపణలపై స్పందించిన హిమంత్ బిశ్వాశర్మ



గువాహటి: అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వా శర్మ భార్య మూడు విదేశీ పాస్‌పోర్టులు కలిగి ఉన్నట్టు కాంగ్రెస్ పార్టీ ఆదివారం తీవ్ర ఆరోపణలు చేసింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంటున్న తరుణంలో కాంగ్రెస్ చేసిన ఆరోపణలు సంచలనం సృష్టించాయి. అయితే ఈ ఆరోపణలను హిమంత బిశ్వా శర్మ తోసిపుచ్చారు. తప్పుడు సమాచారం వ్యాప్తి చెందిన వారిని జవాబుదారీ చేస్తామని హెచ్చరించారు. హిమంత్ బిశ్వా శర్మ భార్య రినికి భూయాన్ శర్మ వద్ద మూడు పాస్‌పోర్ట్‌లు ఉన్నాయని కాంగ్రెస్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు పవన్ ఖేరా ఆదివారంనాడిక్కడ మీడియా సమావేశంలో సంచలన ఆరోపణ చేశారు. యూఏఈ నుంచి ఆమెకు ఒక పాస్‌పోర్ట్ ఉందని, 2022 మార్చి 14న జారీ చేసిన ఆ పాస్‌పోర్టు గడువు 2027 మార్చి 13న ముగుస్తుందని చెప్పారు. ఆంటిగ్వా బార్బుడా దేశం నుంచి ఆమె పేరుతో రెండో పాస్‌పోర్టు 2021 ఆగస్టు 26న జారీ అయిందని, దాని గడువు 2031 ఆగస్టు 25తో ముగుస్తుందని వెల్లడించారు. ఈజిప్ట్ నుంచి మూడో పాస్‌పోర్ట్ కూడా 2022 ఫిబ్రవరి 13న ఆమె పేరుతో జారీ అయిందన్నారు. అది 2029 ఫిబ్రవరిలో ఎక్స్‌పైర్ అవుతుందని చెప్పారు. హిమంత్ బిశ్వా శర్మ రాజకీయ జీవితమంతా ముస్లింలపై విద్వేషంతోనే గడిచిందని, కానీ ఆయన భార్య రెండు ముస్లిం దేశాల నుంచి పాస్‌పోర్టులు కలిగి ఉందని పవన్ ఖేరా ఆరోపించారు. ఎన్నికల్లో ఓటమి తర్వాత దేశం నుంచి పారిపోయేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారా? అని ప్రశ్నించారు. శర్మ భార్యకు దుబాయిలో, యూఎస్ రాష్ట్రం వయోమింగ్‌లో సొంతంగా రెండు ఆస్తులు ఉన్నాయని కూడా ఆయన చెప్పారు. అయితే వీటి గురించి ఎన్నికల అఫిడవిట్‌లో సీఎం వెల్లడించలేదని పేర్కొన్నారు.

**ఓటమి తప్పదనే నిరాశతోనే ఆరోపణలు: సీఎం**

పవన్ ఖేరా చేసిన ఆరోపణలను హిమంత్ బిశ్వా శర్మ తోసిపుచ్చారు. కాంగ్రెస్ పార్టీ తీవ్ర నిరాశా నిస్పృహల్లో ఉందని, ప్రజలు చారిత్రక తీర్పు ఇచ్చేందుకు సిద్ధంగా ఉండటంతో పవన్ ఖేరా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని తిప్పికొట్టారు. సత్యం బయటపడుతుందని, తప్పుడు సమాచారం వ్యాప్తి చేసిన వారు జవాబుదారీ అవుతారని అన్నారు. పవన్ ఖేరా తప్పుడు ప్రచారానికి తెరపడుతుందని, ఆయన జైలుకు కూడా వెళ్లొచ్చని అన్నారు.

# ప్రాణం తీసిన చేప..గొంతులో ఇరుక్కుని

భువనేశ్వం: చేప కారణంగా ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన ఒడిశాలో శుక్రవారం చోటు చేసుకుంది. మయుర్‌భంజ్ జిల్లాలోని దిగి గ్రామానికి చెందిన అభినాశ్ బిజులీ శుక్రవారం చేపలు పట్టడానికి ఊరి బయట ఉన్న చెరువు దగ్గరకు వెళ్లాడు. ఈ నేపథ్యంలోనే అతడికి ఇండియన్ కోయ్ జాతికి చెందిన చేప చిక్కింది. చేప తప్పించుకోకుండా ఉండటానికి దాన్ని నోట్లో పెట్టుకున్నాడు. అయితే ఆ చేప గొంతులోకి దూరింది. ఎంత ప్రయత్నించినా చేప బయటకు రాలేదు. కుటుంబసభ్యులు అతడిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అభినాశ్ ప్రాణాలు కోల్పోయాడు.

# రైలు కోచ్‌ని బుక్ చేసిన కుటుంబం

- పెళ్లి ప్రయాణంలో ఇప్పుడు ఇదో కొత్త ట్రెండ్

భారతీయ వివాహాలంటేనే అట్టహాసాలు, హంగులు, ఆర్భాటాలు. సాధారణంగా పెళ్లి బృందం వెళ్లడానికి బస్సులు లేదా కార్లు బుక్ చేయడం చూస్తుంటాం. కానీ, ఒక కుటుంబం ఏకంగా ట్రైన్‌లో ఒక పూర్తి కోచ్‌నే బుక్ చేసి, తమ పెళ్లి ప్రయాణాన్ని అత్యంత సందడిగా మార్చుకుంది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వైరల్ అవుతున్న వీడియోలో.. అతిథులను ఆహ్వానిస్తూ ఒక పోస్టర్, కోచ్ నేమ్‌ప్లేట్‌కు దండ కట్టడం చూడవచ్చు. అలాగే, కోచ్‌ను పూలతో అలంకరించి, బంధువులందరూ పాటలు పాడుతూ, డ్యాన్స్‌లు చేస్తూ సందడి చేస్తున్నారు. వధువు కేక్ కట్ చేస్తుండగా, కుటుంబమంతా ఆమె చుట్టూ చేరి కేరింతలు కొడుతూ కనిపిస్తారు. ఒక టికెట్ కలెక్టర్ బంధువులను దాటుకుంటూ తన పని



తాను చేసుకుంటూ, ఆ గందరగోళంలో కూడా చిరునవ్వులతో కలిసిపోతూ కనిపిస్తాడు. బయటి వ్యక్తుల ఇబ్బంది లేకుండా, కేవలం తమ బంధు మిత్రులతోనే కలిసి ప్రయాణిస్తుండటం ఈ వీడియో ప్రత్యేకత. రైల్వే శాఖ అందించే 'ఫుల్ టారిఫ్ రేట్' పథకం కింద వీరు ఈ సౌకర్యాన్ని పొందినట్లు తెలుస్తోంది. దీనిపై నెటిజన్లు విపరీతంగా స్పందిస్తున్నారు.

# అస్సాం, బెంగాల్‌లో బీజేపీదే గెలుపు

**- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ**

న్యూఢిల్లీ: త్వరలో జరుగనున్న అస్సాం, పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ సీనియర్ నేత, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి అన్నారు. సమ్మిళిత అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, మతపరమైన ఏ గ్రూపులకు వ్యతిరేకం కాదని చెప్పారు. మైనారిటీలు, ఎస్ఐఆర్‌పై కేంద్రంలోని బీజేపీ వైఖరిపై ఒక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, సమ్మిళిత అభివృద్ధే బీజేపీ విధానమని అన్నారు. ప్రగతి, ఐక్యతకు కట్టుబడి పార్టీ పనిచేస్తోందని, మతపరమైన ఏ గ్రూపులకు వ్యతిరేకం కాదని చెప్పారు. ఎస్ఐఆర్ వంటి అంశాల విషయంలో దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుంటుందని తెలిపారు. 'అస్సాం, బెంగాల్‌లో మేము గెలుస్తామనే గట్టి నమ్మకం నాకుంది. ఏదో ఒక మతాన్ని కాకుండా అందర్నీ కలుపు కుని వెళ్లడమే బీజేపీ విధానం. చొరబాటుదారులను మేము వ్యతిరేకిస్తామే కానీ ముస్లింలకు వ్యతిరేకం కాదు' అని గడ్కరి



వివరణ ఇచ్చారు. పార్టీ ఎన్నికల ప్రచారంలో అభివృద్ధి అనేదే ప్రధాన అంశమని, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధికి కట్టుబడి పార్టీ పనిచేస్తోందని గడ్కరి చెప్పారు. మౌలిక వసతుల కల్పనలో ప్రధానంగా పెట్టుబడులు పెడుతున్నామని, మరిన్ని ప్రాజెక్టులకు కూడా ప్లానింగ్ చేస్తున్నామని తెలిపారు. అస్సాం సహా ఈశాన్య ప్రాంతాల్లో రూ.5 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు అమలు చేస్తున్నామని, రూ.1.5 లక్షల కోట్ల విలువైన మౌలిక వసతుల ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తయ్యాయని, మరో రూ.1.5 నుంచి రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులు అమలు దశలో ఉన్నాయని, అదనంగా మరో రూ.2 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్లాన్ చేస్తున్నామని చెప్పారు. రోడ్లు, హైవేలు, లాజిస్టిక్ వంటి సదుపాయాలతో కనెక్టివిటీ పెరిగి, ఆయా ప్రాంతాలు ఆర్థికంగా బలపడతాయని అన్నారు. ఈశాన్య ప్రాంతాలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సవాళ్లకు ఇదే పరిష్కారమని అన్నారు. అక్రమ చొరబాటుకు తమ పార్టీ వ్యతిరేకమని, ఏ నిర్దిష్ట మతానికి కాదని స్పష్టం చేశారు. అక్రమ చొరబాట్లను అడ్డుకోకుంటే దేశం ధర్మశాలగా మారుతుందని హెచ్చరించారు.

# పైలెట్ రెస్క్యూ ఆపరేషన్!

## అమెరికా అలా.. ఇరాన్ ఇలా...



ఇరాన్ కూల్చేసిన ఫైటర్ జెట్ పైలట్ రక్షణ సందర్భంగా రెండు సొంత యుద్ధ విమానాలను ధ్వంసం చేసుకున్నట్టు అమెరికా ప్రకటించింది. అయితే వాటిని తామే కూల్చినట్టు ఆధారాలను ఇరాన్ చూపించింది.ఏప్రిల్ 3న తెల్లవారుజామున ఇరాన్ దాడిలో అమెరికా ఫైటర్ జెట్ కూలి పోయింది. పారాచూట్ సహాయంతో ఒక పైలట్ సురక్షితంగా చేరుకున్నాడు. ఆ యుద్ధ విమానంలో ఉన్న మరో అమెరికా వైమానికదళ అధికారి ఇరాన్ సరిహద్దులోని కొండల్లో పడిపోయాడు. కాగా, ఆ పైలట్‌ను రక్షించేందుకు అమెరికా మిలిటరీ సాహసోపేత మిషన్ చేపట్టింది. శనివారం అర్ధరాత్రి వేళ పలు యుద్ధ విమానాలు, రవాణా యుద్ధ విమానాలతో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. రెండు రోజులు శ్రమించి కొండ ప్రాంతంపైకి చేరుకున్న అమెరికా వైమానిక అధికారిని సురక్షితంగా కాపా డింది.ఈసాహసోపేతమైన నైట్ మిషన్‌లో ఎలాంటి ప్రాణనష్టంజరగలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గొప్పలుపోయారు. మరోవైపు అమెరికా అధికారి ఒకరు ఈ మిషన్ గురించి వాల్ స్ట్రీట్ జర్నల్‌తో మాట్లాడారు.

పైలట్ రక్షణ సందర్భంగా అమెరికా దళాలు తమ సొంత యుద్ధ విమానాల ను పేల్చివేయాల్సి వచ్చిందని తెలిపారు. ఈ ఆప రేషన్‌లో పాల్గొన్న రెండు ఎంసీ-130 జే రవాణా విమానాలు అక్కడ చిక్కుకున్నట్టు చెప్పారు. ఆ రెండు యుద్ధ విమానాలు ఇరాన్ చేతుల్లోకి వెళ్ల కుండా నిరోధించేందుకు వాటిని ధ్వంసంచేయడం అవసరమైందని అధికారి వెల్లడించారు. అయితే అమెరికా అధికారి స్టేట్‌మెంట్‌ను ఇరాన్ ఖండి చింది. రెండు ఎంసీ-130 జే రవాణా విమానా లను తామే కూల్చినట్టు ప్రకటించింది. ధ్వంసమైన వాటి ఫొటోలను ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ గాలిబాఫ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'అమెరికాకు ఇలాంటి విజయాలు మరో మూడు లభిస్తే, అది పూర్తిగా నాశనమైపోతుంది' అని పేర్కొన్నారు.

# 'హర్మూజ్'ను దాటిన భారత 9వ ఎల్పీజీ నౌక




పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా భారత నౌకల రాకపోకలు నిరంతరాయంగా సాగుతున్నాయి. తాజాగా 'గ్రీన్ ఆశా' అనే భారత ఎల్పీజీ నౌక హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. శనివారం గ్రీన్ శాన్వి ఈ జలసంధిని, దాటగా ఇవాళ గ్రీన్ ఆశా దాటింది. గ్రీన్ శాన్వి హర్మూజ్‌ను దాటిన 8వ భారత నౌక కాగా, గ్రీన్ ఆశా 9వ భారత నౌక కావడం గమనార్హం. పశ్చిమాసియాలో సంక్షోభం మొదలైన ప్పటి నుంచి హర్మూజ్ జలసంధి గుండా నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకుంటోంది. భారత్ సహా కొన్ని మిత్రదేశాల నౌకలను మాత్రమే అనుమతి స్తున్నది.కాగా ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల అనంతరం ఇరాన్ హర్మూజ్ జలసంధిపై పట్టు బిగించింది. దాంతో పశ్చిమాసియాలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత కీలకమైన ఈ మార్గంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి. అయిన ప్పటికీ ఇంధన అవసరాల దృష్ట్యా భారత్ ఈ మార్గంపైనే ఆధారపడుతోంది. గ్రీన్ ఆశాకంటే ముందు కూడా అనేక భారత నౌకలు ఈ ప్రాంతాన్ని విజయవంతంగా దాటాయి. బీడబ్ల్యూ టైర్, బీడబ్ల్యూ ఎల్మ్ అనే రెండు ఎల్పీజీ నౌకలు సుమారు 94,000 టన్నుల కార్గోను రవాణా చేశాయి. మార్చినెలలో ఎంటీ శివాలిక్, ఎంటీ నందాదేవి అనే ట్యాంకర్లు 92,700 టన్నుల ఎల్పీజీని గుజరాత్‌లోని ముంద్రా, కాండ్లా పోర్టులకు చేర్చాయి. వీటితోపాటు ముడి చమురు, ఇతర ఇంధనాలను కూడా భారత నౌకలు రవాణా చేస్తున్నాయి. 'జగ్ లాడ్కి' అనే ఆయిల్ ట్యాంకర్ యూఏఈ నుంచి 80,000టన్నుల ముడి చమురును ముంద్రా పోర్టుకు తీసుకురాగా, 'జగ్ ప్రకాశ్' నౌక ఒమన్‌నుంచి ఆఫ్రికా మార్కెట్లకు గ్యాసోలిన్‌ను చేరవేసింది. దేశీయ ఇంధన భద్రత కోసం ఈ ప్రమాదకర మార్గంలో ప్రయాణం తప్పడం లేదని ప్రస్తుత పరిణామాలు స్పష్టంచేస్తున్నాయి.

## అమెరికా సైన్యం కదలికలపై

# చైనా 'ఏఐ' నిఘానేత్రం



పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంలో ఇరాన్‌కు చైనా రహస్యంగా సాయం చేస్తున్నట్టు పలు నివేదికలు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. అమెరికా సైనిక మోహరింపులు, ఆయుధ నిల్వలు, యుద్ధ విమానాలు, విమానవాహక నౌకల కదలికలు, సైనిక స్థావరాలువంటి వాటిని నిరంతరం పర్యవేక్షించడానికి చైనా టెక్ కంపెనీలు ఏఐ టెక్నాలజీ, ఓపెన్ సోర్స్ డేటాను వాడుతున్నాయట. ఓవైపు యుద్ధం ముగించాలని చైనా బహిరంగంగా ఇరువర్గాలకు సూచిస్తున్నప్పటికీ.. మరోవైపు రహస్యంగా ఇరాన్‌కు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం తమ ప్రైవేట్ కంపెనీల సాయం తీసుకుంటున్నాయి. బహిరంగంగా అందుబాటులో ఉన్న ఉపగ్రహ చిత్రాలు, ఫ్లైట్ ట్రాకర్లు, నౌకా రవాణా సమాచారం, కృత్రిమ మేధను వినియోగించుకొని అమెరికా సైన్యాన్ని ట్రాక్ చేస్తున్నాయని కొన్ని సంస్థలు తెలిపాయి. ఈ సమాచారం అంతటినీ చైనా కంపెనీలు ఆ దేశ సైనిక ఉన్నతాధికారులకు చేరవేస్తున్నట్టు తెలుస్తోంది. అమెరికా దళాల మోహరింపును బహిర్గతం చేసేలా నిఘా టూల్స్‌ను బహిరంగంగా మార్కెటింగ్ చేస్తున్నట్లు తెలిసింది. ఈ నిఘా టూల్స్‌ను ఉపయోగించి ఎవరైనా ఎక్కడి నుంచైనా విమానాల కమ్యూనికేషన్లను విశ్లేషించవచ్చని, భారీ సైనిక కదలికలను పర్యవేక్షించవచ్చని నిఘా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ముప్పును ఎలా ఎదుర్కోవాలనే విషయంపై అమెరికా అధికారులు, నిపుణులు పరిశోధిస్తున్నట్టు సమాచారం. ఈ నిఘా టూల్స్‌ను ఉపయోగించి ఎవరైనా ఎక్కడి నుంచైనా విమానాల కమ్యూనికేషన్లను విశ్లేషించవచ్చని, భారీ సైనిక కదలికలను పర్యవేక్షించవచ్చని నిఘా నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ముప్పును ఎలా ఎదుర్కోవాలనే విషయంపై అమెరికా అధికారులు, నిపుణులు పరిశోధిస్తున్నట్టు సమాచారం.

### ప్రపంచ దేశాలకూ ముప్పు..

చైనా ప్రైవేట్ రంగ జియో స్పేషియల్ విశ్లేషణ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవడం వల్ల అమెరికాకే కాకుండా ప్రపంచ దేశాలకు కూడా ముప్పు పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఓపెన్ సోర్స్ ఇంటెలిజెన్స్ ఒకప్పుడు కొంతమంది నిపుణులకే పరిమితమైందన్నారు. కానీ, ప్రస్తుతం ఏఐ రాకతో ఒకప్పుడు ప్రభుత్వాలకు మాత్రమే లభించే అంతర్గత సమాచారం ఇప్పుడు ప్రైవేటు వ్యక్తులకు కూడా అందుబాటులోకి వస్తోందన్నారు.

## అమెరికా వైమానిక దాడుల్లో ఇరాన్ సైనిక నేతలు మృతి: ట్రంప్



ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి. తాజాగా ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై అమెరికా భారీ వైమానిక దాడులకు పాల్పడింది. దాడుల్లో ఇరాన్‌కు చెందిన మిలిటరీ అగ్రనేతలు చాలామంది మరణించారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఈమేరకు ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ఖాతాలో ప్రకటన చేశారు. "టెహ్రాన్‌పై అమెరికా జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ సైన్యాన్ని బలహీనంగా, తెలివితక్కువగా నడిపించిన చాలామంది ఆ దేశ సైనిక లీడర్లు హతమయ్యారు" అని ట్రంప్ ప్రకటించారు. దీనికి సంబంధించి కొన్ని వీడియోల్ని కూడా ట్రంప్ విడుదల చేశారు. అయితే, మరణించిన మిలిటరీ లీడర్ల వివరాల్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. అయితే, ట్రంప్ ప్రకటనపై ఇరాన్ నుంచి ఎలాంటి స్పందనా లేదు. మరోవైపు ట్రంప్.. హార్మూజ్ జలసంధి విషయంలో ఇరాన్‌కు హెచ్చరిక జారీ చేశారు. 48 గంటల్లోగా జలసంధిని తెరవాలని అల్టిమేటమ్ ఇచ్చారు. లేకుంటే ఇరాన్‌పై విరుచుకు పడుతామని ట్రంప్ అన్నారు. ఈ వార్నింగ్ అనంతరం ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగింది. మరోవైపు తమ పైలట్‌ను కాపాడుకునేందుకు అమెరికా చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైంది. ఇరాన్‌లో చిక్కుకున్న పైలట్‌ను అమెరికా రక్షించుకుంది. ఇంకోవైపు ఇరాన్ కూడా దాడులు కొనసాగిస్తోంది. తాజాగా కువైట్‌పై దాడి చేసింది. కువైట్‌లోని షువైఖ్ ఆయిల్ సెక్టార్ కాంప్లెక్స్‌పై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది.

# అమెరికా హ్యాండిచ్చింది!

### మాకు ఇవ్వాల్సిన క్షిపణులు యుద్ధంలో వాడుతున్నారు: జెలెన్ స్కీ



పశ్చిమాసియాలో యుద్ధంవల్ల అమెరికా ప్రాధాన్యతలు మారుతున్నాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు తమకు అమెరికానుంచి అందిన సైనిక, ఆయుధ సరఫరాను ఆ యుద్ధం కారణంగా తగ్గించి.. వాటిని ఇజ్రాయెల్‌కు మళ్లిస్తున్నారని అన్నారు. ఈ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే అగ్రరాజ్యం నుంచి తమకు వస్తున్న మద్దతు భవిష్యత్తులో మరింత తగ్గే అవకాశం ఉందన్నారు. రష్యా ప్రయోగిస్తున్న బాలిస్టిక్ క్షిపణులను అడ్డుకోవడానికి ఇన్నాళ్లు తాము అమెరికా సరఫరా చేసే పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థలను ఉపయోగించామన్నారు. ఇప్పుడు వాటి సరఫరా నిలిచిపోవడంతో యుద్ధంలో తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. తమ ఆయుధ నిల్వలు రోజురోజుకు తగ్గిపోతున్నాయని జెలెన్ స్కీ వాపోయారు. కొద్దికాలంగా అమెరికా మద్దతు తగ్గుతుండడంతో స్వదేశీ డ్రోన్ల తయారీని పెంచామన్నారు. కాగా డ్రోన్లు, క్షిపణుల ఉత్పత్తికి అంతరాయం కలిగించడానికి రష్యా తమ ఇంధన నిల్వలను టార్గెట్ చేయడం ఇబ్బందికరంగా మారిందన్నారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడడంతో మిత్ర దేశాలనుంచి కూడా ఎటువంటిసహాయం అందట్లేదన్నారు. మరోవైపు యుద్ధం ముగింపునకు అమెరికా మధ్యవర్తిత్వంతో జరుగుతున్న చర్చల్లోనూ పురోగతి కనిపించట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే అదునుగా తీసుకొని రష్యా తమపై దాడులను మరింత తీవ్రం చేస్తోందన్నారు. పశ్చిమాసియా యుద్ధంవల్ల రష్యా ఆర్థిక ప్రయోజనాలు పొందుతోందని జెలెన్ స్కీ ఆరోపించారు. ఇరాన్ హర్మూజ్‌ను మూసివేయడంతో ప్రపంచ దేశాలు మళ్లీ రష్యానుంచి పెద్ద మొత్తంలో చమురు కొనుగోలు చేస్తున్నాయన్నారు. దీంతో మాస్కో తమ సైనిక సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటుందన్నారు. ఇరాన్ ప్రయోగిస్తున్న డ్రోన్లను ఎదుర్కోవడానికి తమ సైనిక నిపుణులు గల్ఫ్ దేశాలకు సాయం చేస్తున్నట్లు జెలెన్ స్కీ తెలిపారు. తద్వారా ఆయా దేశాలు తమవద్ద ఉన్న యాంటీ-బాలిస్టిక్ క్షిపణులను తమకు సరఫరా చేసే అవకాశం ఉందన్నారు.

స్పోర్ట్స్
చైతన్యరథం








# పంత్ పంచ్..లఖ్‌నవూ బోణీ

## ఉప్పల్ స్టేడియంలో ఉత్కంఠ పోరులో హైదరాబాద్‌పై విజయం

ఐపీఎల్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బోణీ కొట్టింది. తొలి మ్యాచ్‌లో ఢిల్లీ చేతిలో ఓడిన ఆ జట్టు ఆదివారం సన్ రైజర్స్ హైదరాబాద్‌పై ఘన విజయం సాధించింది. ఉప్పల్ వేదికగా చివరి వరకు ఉత్కంఠ గా జరిగిన ఈ మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఎస్‌ఆర్‌హెచ్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 156 పరుగు లు చేసింది. అనంతరం లఖ్‌నవూ 5 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసి విజయం సాధించింది. ఎల్‌ఎస్‌జీ కెప్టెన్ రిషబ్ పంత్(68) హాఫ్ సెంచరీతో రాణించాడు. ఓపెనర్ ఎడెన్ మార్‌క్రమ్.. సన్‌రైజర్స్ బౌలర్లపై విరుచు కుపడ్డాడు. 27 బంతుల్లో 45 పరుగులు చేసి.. శివాంగ్ కుమార్ బౌలింగ్ లో పెవిలియన్ చేరాడు. చివరి ఓవర్ వరకు వెళ్లిన మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. చివరి ఓవర్‌లో 9 పరుగులు అవసరం కాగా పంత్ వరుసగా రెండు ఫోర్లు కొట్టాడు. తర్వాత రెండు బంతులకు పరుగులు రాకపోవడంతో మ్యాచ్ టై అవుతుందని భావించారు. అయితే ఐదో బంతికి బౌండరీ బాదడంతో లఖ్‌నవూ ఒక బంతి మిగిలి ఉండగానే విజయం సాధించింది. మిగిలిన బ్యాటర్లలో అబ్దుల్ సమద్ 16, మిచెల్ మార్ష్ 14, ఆయుశ్ బదోని 12 పరుగులు చేశారు. ఎస్‌ఆర్ హెచ్ బౌలర్లలో హర్ష్ దూబె 2 వికెట్లు సాధించగా.. ఎషాన్ మలింగ, శివాంగ్ కుమార్ చెరో వికెట్ సాధించారు.

**రాణించిన నితీశ్, క్లాసెన్**

సన్ రైజర్స్ హైదరాబాద్ టాప్ ఆర్డర్.. అభిమానులను నిరాశపర్చింది. ఫలితంగా మ్యాచ్ చేజారింది. టాస్ ఓడిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 156 పరుగులు చేసింది. హెన్రిచ్ క్లాసేన్(62), నితీశ్ కుమార్ రెడ్డి(56) రాణించడంతో కనీసం ఆ స్కోర్ అయినా చేయగలి గింది. ఎల్‌ఎస్‌జీ బౌలర్లలో మహ్మద్ షమీ, ప్రిన్స్ యాదవ్, అవేశ్ ఖాన్ తలో రెండు వికెట్లు సాధించగా.. మనిమారన్ సిద్ధార్థ్, దిగ్వేశ్ సింగ్ రాఠీ చెరో వికెట్ సాధించారు. లఖ్‌నవూ పేసర్ మహ్మద్ షమీ దెబ్బకు ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ స్వల్ప పరుగులకే పెవిలియన్ చేరారు. అభిషేక్ డకౌట్ కాగా.. హెడ్ కేవలం 7 పరుగులు మాత్రమే చేశాడు. కెప్టెన్ ఇషాన్ కిషన్(1) సైతం విఫలమ య్యాడు. లివింగ్ స్టోన్(14) కాసేపు నిలబడినా.. పరుగులు రాబట్ట డంలో ఇబ్బంది పడ్డాడు. చివరకు 26 పరుగుల వద్ద నాలుగో వికెట్‌గా వెనుదిరిగాడు. ఏడు ఓవర్లకు కేవలం 26 పరుగులతో ఎస్‌ఆర్ హెచ్ పీక ల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్రమంలో క్లాసెన్(62), నితీశ్ కుమార్ రెడ్డి(56) జోడి జట్టును ఆదుకుంది. వీరిద్దరు ఐదో వికెట్‌కు 116 పరుగుల భాగస్వా మ్యాన్ని నెలకొల్పారు. మనిమారన్ సిద్ధార్థ్ 142 పరుగుల వద్ద నితీశ్ రెడ్డిని ఔట్ చేసి.. ఆ జోడిని విడదీశాడు. కాసేపటికే క్లాసెన్, హర్ష్ దూబె లను వరుస బంతుల్లో ఆవేశ్ ఖాన్ ఔట్ చేశాడు. తర్వాత వచ్చిన టెయి లెండర్లు లఖ్‌నవూ బౌలర్ల దెబ్బకు పెవిలియన్ క్యూ కట్టారు. దీంతో 9 వికె ట్లు కోల్పోయిన ఎస్‌ఆర్‌హెచ్ 156 పరుగులు చేసింది.



**డకౌట్లలో అభిషేక్ శర్మ రికార్డ్**

లఖ్‌నవూతో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ సంచల నం అభిషేక్ శర్మ ఓ చెత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ఒకే ఏడాదిలో అత్యధిక సార్లు సున్నా పరుగులకే వెనుదిరిగిన భారత ఆటగాళ్ల జాబితాలో రోహిత్ శర్మ, సంజు శాంసన్ సరసన అభిషేక్ నిలిచాడు. ఓపెనర్‌గా బరిలో దిగిన అభిషేక్ ఇన్నింగ్స్ తొలి ఓవర్ చివరి బంతికే షమీ వేసిన 'స్లోయర్' డెలివరీని అర్థం చేసుకోవడంలో పూర్తిగా విఫలమ య్యాడు. బంతి బ్యాట్ అంచుకు తగిలి షార్ట్ థర్డ్ దిశగా వెళ్లగా, అక్కడ ఉన్న మని మారన్ సిద్ధార్థ్ అద్భుతమైన డైవ్‌తో క్యాచ్ పట్టాడు. దీంతో అభిషేక్ ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఈ డకౌట్‌తో అభిషేక్ శర్మ ఒకే సంవత్సరం(2026)లో ఆరోసారి సున్నాకే అవుట్ అయ్యాడు. గతంలో 2018లో టీమిండియా స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ, 2024లో సంజు శాంసన్ కూడా ఒకే ఏడాదిలో ఆరు సార్లు డకౌట్ అయ్యారు. తాజాగా ఈ యువ ఓపెనర్ కూడా వారి సరసన చేరి అభిమానులను నిరాశపరిచాడు. సన్ రైజర్స్ తరఫున ఐపీఎల్‌లో అత్యధిక సార్లు డకౌట్ అయిన ఆటగాళ్ల జాబితాలో రషీద్ ఖాన్ (9), భువనేశ్వర్ కుమార్ (5) తొలి రెండు స్థానాల్లో నిలిచారు. 4 డకౌట్లతో అభిషేక్ శర్మ మూడో స్థానంలో ఉన్నాడు.




## సెహ్వాగ్-గంభీర్‌లనే
# వెనక్కి నెట్టేసిన వైభవ్!

ఐపీఎల్ 19వ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తన బ్యాటింగ్‌తో ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. తన అరంగేట్ర మ్యాచ్‌లోనే మెరుపు హాఫ్ సెంచరీతో అందరి దృష్టిని ఆకర్షించిన వైభవ్.. నిన్న గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో కేవలం 18 బంతుల్లోనే 31 పరుగులు చేశాడు. దీంతో ఓ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఈ మెరుపు ఇన్నింగ్స్ ద్వారా భారత దిగ్గజ ఓపెనర్లు వీరేంద్ర సెహ్వాగ్, గౌతమ్ గంభీర్ పేరిట ఉన్న 18 ఏళ్ల నాటి రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొట్టాడు. మరి.. ఆ వివరాలు ఏమిటో ఇప్పుడు చూద్దాం.. శనివారం గుజరాత్ టైటాన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో మహ్మద్ సిరాజ్ వేసిన తొలి ఓవర్ రెండో బంతికే ఫోర్ బాదడం ద్వారా వైభవ్ సరికొత్త చరిత్ర లిఖించాడు. ఆ బౌండరీతో సూర్యవంశీ, యశస్వీ జైస్వాల్ జోడీ ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత వేగంగా 500 పరుగుల భాగస్వామ్యాన్ని పూర్తి చేసిన ఓపెనింగ్ జోడీగా రికార్డు క్రియేట్ చేసింది. గతంలో 2008లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరఫున వీరేంద్ర సెహ్వాగ్–గౌతమ్ గంభీర్ జోడీ 309 బంతుల్లో 500 పరుగులు పూర్తి చేసింది.తాజాగా వైభవ్, జైస్వాల్ జోడీ కేవలం 248 బంతుల్లోనే ఈ మైలు రాయిని అందుకుంది. వీరిద్దరూ కలిసి పవర్ ప్లేను పూర్తిస్థాయిలో వాడుకుని 6.2 ఓవర్లలోనే 70 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఓ టీనేజర్, ఓ యువ ఆటగాడు కలిసి సృష్టించిన ఈ రికార్డును భవిష్యత్తులో దిగ్గజ ఆటగాళ్లు కూడా అధిగమించడం కష్టమేనని క్రీడా నిపుణులు అంటున్నారు.

# బెంగళూరు బాదుడు
## - చెన్నైపై ఘన విజయం

ఐపీఎల్ 2026లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఘన విజయం సాధించింది. టాస్ ఓడిన ఆర్సీబీ తొలుత బ్యాటింగ్ చేసింది. భారీ స్కోర్ చేసింది. నిర్ణీత 20 ఓవర్‌లో 3 వికెట్ల నష్టానికి 250 పరుగులు చేసింది. టిమ్ డేవిడ్.. చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 25 బంతుల్లో 70 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దేవ్‌దత్ పటిక్కల్(50) కూడా అర్ధ సెంచరీతో రాణించాడు. మిగిలిన బ్యాటర్లలో రజత్ పటిదార్(48), ఫిల్ సాల్ట్(46), విరాట్ కోహ్లీ(28) కూడా ఆకట్టుకున్నారు. రజత్ పటిదార్ కేవలం 19 బంతుల్లోనే 48 పరుగులు చేసి.. చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఏ దశలోనూ సీఎస్కే బౌలర్లు..



ఆర్సీబీ బ్యాటర్లను కట్టడి చేయలేకపోయారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ చివరి వరకు పోరాడింది. 19.4 ఓవర్ల లో 207 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులో సర్ఫరాజ్ ఖాన్ 25 బంతుల్లో 50 పరుగులు, ప్రశాంత్ వీర్ 43, జెమీ ఓవర్టన్ 37 పరుగులు చేశారు. ఓపెనర్లు విఫలం కావడంతో ఓటమి తప్పలేదు.

# జీటీ ఓటమిపై అశ్విన్ స్పందన


ఐపీఎల్ 2026లో భాగంగా శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో గుజరాత్ టైటాన్స్‌పై 6 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో గుజరాత్ ఆటగాళ్ల ప్రదర్శన గురించి టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ స్పందించాడు. జీటీ జట్టు పరాజయంపై అతడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఓపెనర్ సాయి సుదర్శన్ అద్భుతమైన ఆరంభాన్నిచ్చినప్పటికీ.. మిడిలార్డర్ బ్యాటర్ల వైఫల్యమే ఆ టీమ్ ఓటమికి కారణమైందన్నాడు. 'ఈ మ్యాచ్‌లో జీటీ ఎలా ఓడిపోయిందో నాకర్థం కావడం లేదు. వాళ్లు గెలుస్తూ వచ్చారు. ఆ తర్వాత ఇంకాస్త పుంజుకున్నారు.. అయినప్పటికీ ఓటమిపాలయ్యారు. చివరి ఓవర్‌లో కేవలం 11 పరుగులు కాపాడుకోవాల్సి ఉండగా.. తొలి బంతిని వైడ్ వేసిన తర్వాత 5 యార్కర్లు వేయడం అంత ఈజీ కాదు. రియాన్ పరాగ్ చివరి ఓవర్‌ను నంద్రే బర్గర్‌కు ఇవ్వలేదు. చివరి ఓవర్ అతడికే ఇస్తాడని అంతా అనుకున్నాం' అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో చెప్పుకొచ్చాడు. అంతేకాకుండా.. ఈ పోరులో 4 వికెట్లతో రాణించి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన రవి బిష్ణోయ్ ప్రదర్శనపైనా అశ్విన్ మాట్లాడాడు. అతడు కీలకమైన బ్రేక్‌త్రూలను



అందించాడని కొనియాడాడు. 'ఇప్పుడు బిష్ణోయ్‌కు గుర్తింపునివ్వాల్సిన సమయం వచ్చింది. అతడు ఇప్పుడు పర్పుల్ క్యాప్ సొంతం చేసుకున్నాడు. అతడి తలపై ఆ క్యాప్ చాలా అందంగా ఉంది' అని ఈ మాజీ స్పిన్నర్ వ్యాఖ్యానించారు.

చైతన్య రథం
# సినిమా
సోమవారం 6 ఏప్రిల్ 2026 X

## హాలీవుడ్ స్క్రీన్‌కి కింగ్ ఖాన్?



ప్రముఖ హాలీవుడ్ వెబ్ సిరీస్ 'ది వైట్ లోటస్' మూడో సీజన్ గురించి సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వార్త ప్రస్తుతం వైరల్‌గా మారింది. బాలీవుడ్ బాద్‌షా షారూఖ్ ఖాన్ ఈ క్రేజీ సిరీస్‌లో నటించబోతున్నారంటూ నెట్టింట పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. హెచ్‌బీఓ ఛానెల్‌లో అత్యంత పాపులరైన డార్క్ కామెడీ డ్రామా సిరీస్ 'ది వైట్ లోటస్'. దీని మూడో సీజన్ చిత్రీకరణ థాయ్‌లాండ్‌లో జరుగుతోంది. అయితే, ఈ సిరీస్ నుంచి బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకోనే తప్పుకుందనే వార్తలు వచ్చిన కొద్ది రోజులకే.. ఆ స్థానంలోకి షారూఖ్ ఖాన్ రాబోతున్నారంటూ ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. షారూఖ్ ఖాన్ ప్రస్తుతం తన సొంత భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నాడని. హాలీవుడ్ షోలలో నటించే ఆలోచన ఆయనకు ప్రస్తుతానికి లేదని వెల్లడించినట్లు తెలుస్తుంది. మరోవైపు 'ది వైట్ లోటస్' టీమ్ గానీ, షారూఖ్ మేనేజ్‌మెంట్ గానీ ఈ వార్తలపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

## డబ్బింగ్ స్టేజ్‌లో లెనిన్



అక్కినేని యంగ్ హీరో అఖిల్ ప్రస్తుతం తన లెనిన్ చిత్రాన్ని దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరి(నందు) డైరెక్షన్‌లో చేస్తున్నాడు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన డబ్బింగ్ వర్క్ కొనసాగుతోంది. అఖిల్ చిత్తూరు డైలాగ్ డెలివరీతో ఈ సినిమాలో అలరించేందుకు రెడీ అవుతున్నారు.అయితే,షూట్ ఇంకా బ్యాలెన్స్ ఉందని.. అయినప్పటికీ పోస్ట్ ప్రొడక్షన్ పనులను కూడా శరవేగంగా చేయాలని టీమ్ ప్లాన్ చేస్తోందట. కాగా ఈ సినిమా.. రాయలసీమ బ్యాక్ డ్రాప్‌తో చిత్తూరు ప్రాంతం నేపథ్యంలో తెరకెక్కుతుంది. ఇక ఈ సినిమాలో అందాల భామ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది.ఇక సినిమాపై భారీ అంచనాలున్నాయి. ముఖ్యంగా అఖిల్ -భాగ్యశ్రీ కలయికలో లవ్ సీన్స్ చాలా బాగుంటాయట. అన్నట్టు ఈ సినిమాపై అఖిల్ చాలా హోప్స్ పెట్టుకున్నాడు. సినిమా అవుట్‌పుట్ అయితే బాగా వస్తోందని టీమ్ చెబుతుంది. మరి ఈ సినిమాతో అఖిల్ హిట్ కొడతాడో లేదో చూడాలి. ఈ సినిమాపై మాత్రం మంచి హైప్ ఉంది.

## అన్నీ ప్రేమలు కావు కానీ..



సినిమాలకు అతీతంగా నటి త్రిష కొన్ని రోజులుగా వార్తల్లో నిలుస్తున్న సంగతి తెలిసిందే. ఓ నటుడితో కలిసి వేడుకకు వెళ్లడం తమిళనాడు రాజకీయాల్లోనూ చర్చనీయాంశమైంది. ఈ క్రమంలో ఎన్నో రూమర్లు వచ్చాయి. ఊహాగానాలు ఇంకా వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రేమకు సంబంధించిన ఓ కోట్‌ను త్రిష పోస్టు చేశారు. "ప్రతిదీ ప్రేమ కాదు. కానీ, ప్రేమ లేకపోతే దేనికీ అర్థం లేదు" అని ఉన్న ఫొటోను షేర్ చేస్తూ 'ఫ్యాక్ట్' (వాస్తవం) అని పేర్కొన్నారు. సినిమాల విషయానికొస్తే.. త్రిష రెండు దశాబ్దాలకు పైగా హీరోయిన్‌గా రాణిస్తుండటం విశేషం. ప్రస్తుతం ఆమె చేతిలో (సూర్య సరసన నటించిన 'కరుప్పు' (తెలుగులో వీరభద్రుడు మే 14న విడుదల కానుంది. చిరంజీవితో కలిసి నటించిన 'విశ్వంభర' రిలీజ్‌కు సిద్ధమవుతోంది. మోహన్‌లాల్‌తో కలిసి యాక్ట్ చేసిన 'రామ్' మూవీ పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది) మూడు సినిమాలు ఉన్నాయి.

## ఔనా! నిజమా?







భారతీయ సినీ పరిశ్రమ నుంచి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న పాన్ వరల్డ్ ప్రాజెక్టులలో ఒకటైన రామాయణపై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. రణబీర్‌కపూర్, సాయిపల్లవి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని నితీష్ తివారి భారీస్థాయిలో తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు ప్రేక్షకులనుంచి అద్భుతమైన స్పందన లభించడంతో, సినిమాపై హైప్ మరింత పెరిగింది. విజువల్స్, మేకింగ్ స్టాండర్డ్స్ ఇప్పటికే హాలీవుడ్ రేంజ్‌లో ఉన్నాయని అందరూ భావిస్తున్నారు. ఇక ఈ ప్రాజెక్టుకు సంగీతం అందిస్తున్న వారు కూడా పాపులర్ మ్యూజిక్ డైరెక్టర్స్ కాగా వారు హాలీవుడ్ దిగ్గజం హన్స్ జిమ్మర్, ఇండియన్ లెజెండ్ ఏఆర్ రెహమాన్. ఈ ఇద్దరూ కలిసి సినిమాకు సంగీతం అందించడం ప్రత్యేక ఆకర్షణగా మారింది. అయితే తాజాగా సినిమాకు సంబంధించిన ఓ వార్త ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఏఆర్ రెహమాన్ ఈ చిత్రానికి ఏకంగా రూ.30 కోట్ల పారితోషకం అందుకున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

ఈ వార్త నిజమైతే, ఇండియన్ సినిమా చరిత్రలోనే అత్యధిక పారితోషకం అందుకున్న సంగీత దర్శకుడిగా రెహమాన్ నిలిచే అవకాశముంది. ఇప్పటివరకు ఏ సంగీత దర్శకుడూ ఈ స్థాయిలో రెమ్యునరేషన్ పొందలేదని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాలో యశ్, సన్నీడియోల్, మాధవన్‌వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ భారీ ప్రాజెక్టును ప్రముఖ నిర్మాత నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. అత్యాధునిక సాంకేతికతతో, భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రం ఈ ఏడాది దీపావళి సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. రామాయణ చిత్రం కేవలం కథ, విజువల్స్ మాత్రమే కాదు, సంగీతం పరంగానూ కొత్త బెంచ్‌మార్క్ సెట్ చేయబోతోందని స్పష్టమవుతోంది. ఇక ఏఆర్ రెహమాన్ రూ.30 కోట్ల రెమ్యునరేషన్ వార్త నిజమా? కాదా? అన్నది తెలియాల్సి ఉన్నా, సినిమాపై అంచనాలు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి.

## జైలర్-2పై రజనీ క్లారిటీ



సూపర్ స్టార్ రజనీకాంత్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి జైలర్ సీక్వెల్. తలైవా టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రాన్ని కోలీవుడ్ డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ డైరెక్ట్ చేస్తున్నాడు. ప్రస్తుతం మూవీ షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు తలైవా. మీడియాతో చేసిన చిట్‌చాట్‌లో ఆసక్తికర విషయాన్ని షేర్ చేశాడు రజినీకాంత్. జైలర్-2 షూటింగ్ తుది దశలో ఉందని.. త్వరలో చిత్రీకరణ పూర్తవుతుందని తెలిపాడు. అంతేకాదు విడుదల తేదీని మేకర్స్ త్వరలోనే ప్రకటిస్తుందని కూడా చెప్పాడు. జైలర్-2ను జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నామని ఇప్పటికే రజినీకాంత్ క్లారిటీ కూడా ఇచ్చాడని తెలిసిందే. తాజాగా టాక్ ప్రకారం ఇండిపెండెన్స్ డే వీకెండ్ టైంలో జైలర్-2 విడుదలకు ప్లాన్ చేస్తున్నారని వార్తలు వస్తుండగా.. మేకర్స్‌నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. సీక్వెల్‌లో బాలీవుడ్ భామ విద్యాబాలన్‌తోపాటు కోలీవుడ్ యాక్టర్ సంతానం కీలక పాత్రల్లో నటిస్తున్నారని తెలుస్తుండగా.. మరి రాబోయే రోజుల్లో ఈ స్టార్ యాక్టర్లపై అఫీషియల్ అప్‌డేట్ రావాల్సి ఉంది. జైలర్ ఫస్ట్ పార్టులో రమ్యకృష్ణ, వినాయకన్, వసంత్ రవి, మోహన్ లాల్, శివరాజ్ కుమార్, తమన్నా కీలక పాత్రల్లో నటించారని తెలిసిందే. సీక్వెల్‌లో ఎవరెవరు ఉండబోతున్నారన్న దానిపై మేకర్స్‌నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. సీక్వెల్‌లో శివరాజ్‌కుమార్, మోహన్ లాల్ పాత్రలు రిపీట్ కానున్నాయని ఇప్పటికే వార్తలు వచ్చాయి. మరోవైపు తాజాగా బాలీవుడ్ బాద్ షా షారుక్ ఖాన్ ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడని అప్‌డేట్ కూడా వచ్చింది.

## 'రుద్ర-మందాకిని' సీన్స్‌పైనే ఫోకస్



రాజమౌళి -మహేష్‌బాబు సినిమా 'వారణాసి'ని హాలీవుడ్ స్థాయిలో నిర్మించబోతున్నారు. సినిమాలో హీరోయిన్‌గా ప్రియాంక చోప్రా నటిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో సిద్ధం చేసిన ప్రత్యేక సెట్‌లో మహేశ్, ప్రియాంక, పృథ్వీరాజ్‌లపై కీలక సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు. ఆమె ఈ సినిమాలో మందాకినిగా యాక్షన్ పాత్రలో కనిపిస్తు ఉండగా.. మహేశ్ రుద్రగా.. శ్రీరాముడిగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. అయితే, ప్రస్తుతం చేస్తున్న సీన్స్ 'రుద్ర -మందాకిని'లకు సంబంధించినవి అని తెలుస్తోంది. అన్నట్టు 'వారణాసి' చిత్రం రూ.1300 కోట్లకుపైగా భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతోంది. కాగా ఈ భారీ ప్రాజెక్టును కెఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు దేశవ్యాప్తంగా మంచి స్పందన లభించింది. ఈ చిత్రానికి సంగీతాన్ని ఎంఎం కీరవాణి అందిస్తుండగా, కథా కథనాన్ని విజయేంద్ర ప్రసాద్ రూపొందించారు. ఇక ఈ సినిమాకి దేవా కట్టా సంభాషణలు అందిస్తున్నారు. ఈ సినిమాను పూర్తిగా ఐమాక్స్ ఫార్మాట్లో చిత్రీకరిస్తుండగా, పలు భాషల్లో విడుదల చేయనున్నారు.



## విజయ్‌తో పూజా ఐటెమ్?

విజయ్ దేవరకొండ హీరోగా దర్శకుడు రవికిరణ్ కోలా తెరకెక్కిస్తున్న సినిమా 'రౌడీ జనార్దన్'. ఈ సినిమాలో ఓ ఐటెం సాంగ్ ఉండబోతుందని.. ఈ సాంగ్‌లో విజయ్ దేవరకొండతో కలిసి డాన్స్ చేయడానికి పూజా హెగ్డేను తీసుకోబోతున్నారని తెలుస్తోంది. 'కూలీ'లో కూడా పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ చేసిన సంగతి తెలిసిందే. మరి ఇప్పుడు విజయ్ దేవరకొండ సరసన కూడా పూజా హెగ్డే స్పెషల్ సాంగ్ చేస్తే ఎలా ఉంటుందో చూడాలి. అన్నట్టు ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్ బ్యాక్‌లో విజయ్ దేవరకొండ ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపిస్తాడట. పైగా విజయ్ దేవరకొండ యాక్షన్ సీన్స్ సినిమా మొత్తంలోనే మెయిన్ హైలైట్‌గా ఉంటాయట. స్టార్ ప్రొడ్యూసర్ దిల్‌రాజు నిర్మిస్తున్న సినిమాలో సీనియర్ హీరో రాజశేఖర్ కూడా నటిస్తున్న సంగతి తెలిసిందే. అన్నట్టు రాజశేఖర్ పాత్ర అండ్ ఆయన లుక్ మునుపెన్నడూ చూడని రీతిలో ఉంటుందట. కాగా ఈ సినిమా కథ గ్రామీణ నేపథ్యంలో సాగనుంది. ఈ సినిమాలో విజయ్‌కు జోడీగా కీర్తి సురేష్ నటించనుంది. మొత్తానికి ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. మరి ఈ సినిమా ఏ రేంజ్‌లో ఉంటుందో చూడాలి.